ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం
23 జనవరి, 2011

ఉచిత విజ్ఞాన సర్వస్వం

వికీపీడియాకు పదేళ్లు

2011 హ్యాపీ బర్త్‌డే

(2011 జనవరి 23 నుంచి 2011 జనవరి 29 వరకు)

ఎన్. ప్రశన్య
2సం॥,జనవరి-24
లావణ్య-సందీప్
లండన్

పి. ఈషిత
4సం॥,జనవరి-27
శైలజ-అజయ్‌కుమార్
విజయవాడ

దాక్షాయని
జనవరి-25
శ్రీనివాసరావు
సూళ్లూరు పేట-నెల్లూరు

ఎ. ఆకాష్-టి. సునంద
7సం॥,జనవరి24- 3సం॥,జనవరి-23
ఎ. లక్ష్మి-ఆంజనేయులు-టి. లక్ష్మి-విజయవర్మ
టంగుటూరు-ప్రకాశం

అవని
2సం॥,జనవరి-2009
సుభాషిణి-శ్రీరాం
చోడవరం-విశాఖపట్నం

కార్తికేయ
2సం॥,జనవరి-2009
శ్రీలత-చంద్రశేఖర్
కృష్ణలంక-విజయవాడ

బి. ఇషాంత్‌కుమార్
2సం॥,జనవరి-25
రాజేశ్వరి-సతీష్
విజయనగరం

కె. సందీప్‌కుమార్
1సం॥,జనవరి-2010
రాణెమ్మ-రాజయ్య
మార్కాపురం-ప్రకాశం

ఎం. మనోహర్
7సం॥,జనవరి-2006
శశికళ-దశరథ
నందివనపర్తి-రంగారెడ్డి

కావ్యకృతి
4సం॥,జనవరి-2007
పార్వతి-రవికుమార్
బివిఎస్ లేఅవుట్-విశాఖ

మనలో మాట

'ఘన'తంత్రం!

జనవరి 26 వచ్చిందంటే చాలు! ఢిల్లీ నుంచి గల్లీ వరకు మువ్వన్నెల పతాకాలు రెపరెపలాడతాయి. మైకులు దేశభక్తి గీతాలు ఆలపిస్తాయి. ఎక్కడ చూసినా దేశభక్తి పొంగి పొర్లుతుంటుంది. మంచు తెరలను చీల్చుకుంటూ దేశ రాజధానిలో జరిగే గణతంత్ర దినోత్సవ వేడుకలు వీక్షకులను కట్టిపడేస్తాయి. సైనిక కవాతులో రాష్ట్రపతి గౌరవ వందనం స్వీకరిస్తారు. త్రివిధ దళాలు సైనిక పాటవాన్ని ప్రదర్శిస్తాయి. వివిధ రాష్ట్రాల సంస్కృతులను ప్రదర్శించే శకటాలు మంత్రముగ్ధుల్ని చేస్తాయి. సాహసబాలలు అవార్డులు అందుకుంటారు. బుల్లెట్ ప్రూఫ్ అద్దాల మాటు నుంచి రాష్ట్రపతి శాంతి ప్రవచనాలు, శౌర్యవాక్కులు సాగిపోతాయి...

ఆ మరుక్షణం షరా మామూలే!

కులాల కుమ్ములాటలు, భాషల సిగపట్లు, ప్రాంతీయ దురభిమానాలు, మతతత్వ విద్వేషాలు, తీవ్రవాద దాడులు, ఇరుగుపొరుగు కుంపట్లు, రైతుల ఆత్మహత్యలు, ఆకలి కేకలు, అజ్ఞాన తిమిరాలు, అవినీతి దుర్గంధాలు, డొక్కలెగరేసే పేదలు, ప్రేమ పేర ఉన్మాదుల దాడులు, వరకట్న చితిమంటలు, పొట్టకూటి వలసలు, పోలీసు లాకప్పుల్లో చిత్రహింసలు, గాల్లో కలిసే బడుగుల ప్రాణాలు, భ్రూణ హత్యలు, బాలకార్మికుల బండచాకిరీ, నలిగిపోతున్న కనీస హక్కులు...రక్షిత నీటికి కరువు, పల్లెల్లోనూ మినరల్ వాటరే ఆదరువు. మూలమూలకూ విస్తరించిన కూల్‌డ్రింకుల వ్యాపారం. ప్రాణాలు హరిస్తున్న పావలా వడ్డీ. కొంటేనే చదువు. అమ్మకానికి ఆరోగ్యం...అన్నీ... అన్నీ...మామూలే.

అరవయ్యేళ్లలో అసలేం అభివృద్ధి జరగలేదా అంటే...!

కోటీశ్వరులు శత సహస్ర కోటీశ్వరులయ్యారు. ఆకాశహర్మ్యాలలో నివాసముంటున్నారు. కాలు కింద పెట్టకుండా పడవంత కార్లలో ప్రయాణిస్తున్నారు. అవినీతి మార్గంలో కోట్లకు కోట్లు బొక్కుతున్నారు. స్విస్ బ్యాంకుల్లో కోట్లకుకోట్లు దాస్తున్నారు. ప్రభుత్వం అండతో ప్రజాధనం స్వంతం చేసుకొంటున్నారు.

తతిమ్మావారో...! పేదలు కటిక పేదలౌతున్నారు. రైతులు కూలీలౌతున్నారు. ఆకాశంలో విహరించే ధరలను ఎగిరెగిరి పట్టుకోలేక అలసిపోతున్నారు.

ఇదేనా మన రాజ్యాంగం కలలుగన్న భారతం?

ఇదేనా మన గణతంత్రం. 'ఘన'తంత్రం?

★

ఈ సంచికలో....

టపా	...	2
రుచి	...	3
కవిత్వమ్	...	6
కొత్త పుస్తకాలు	...	7
సీరియల్	...	8
చూద్దామా	...	12
అట్టమీది కథ	...	14
కథ	...	18
తెల్సా	...	21
బాలనేస్తాలు	...	22
మాటలకోట	...	24

ఇంకా...

సాహస బాలలు ... 4

ఔరా... సాహస బాలలు...

సినిమా ... 10

దక్షిణాదిలో సినిమాల శ్రీకార గాథలు

వికాసం ... 20

ఆదరిస్తే అద్భుతాలు!



'నిశ్శబ్ద గమనం'తో సందేహ నివృత్తి

కుల మత ప్రాంత విచక్షణ లేకుండా సర్వజనులకు అత్యంత ప్రీతి పాత్రమైనది మందు. ఆరోగ్య, ఆర్థిక, సామాజిక వినాశనానికి దారితీస్తున్న ఈ 'మందు' నియంత్రణ కేవలం ఏలిన వారి నిజాయితీ, సామజిక స్పృహతో కూడిన చిత్తశుద్ధి వల్ల మాత్రమే సాధ్యం. ఈ ఆవేదన 'మనలో మాట'లో చమత్కారంగా ధ్వనించింది. కంప్యూటర్‌లో పూర్తి పరిజ్ఞానం లేనప్పటికీ ఇంటర్నెట్ వాడకం అనివార్యమైన సామాన్య పౌరులకు, మెయిల్స్ నిర్వహణలో స్పామ్ మెయిల్స్ ఫిల్టరింగ్ వ్యాసం ప్రాథమిక సమాచారానికి ఎంతో ఉపయోగకరంగా ఉంది. భాస్కరరావు గారి అట్టమీది కథ 'సముద్ర గర్భంలో నిశ్శబ్దయానం' వ్యాసం క్రమపద్ధతిలో, పొందిగ్గా సమన్వయంతో సాగి అనేక సందేహాలను తీర్చింది. జలాంతర్గామి ఆలోచన, ఆవిర్భావం, పనిచేసే విధానం... మొదలయిన విషయాలు శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం లేని సామాన్య వ్యక్తులకు సైతం అర్థమయ్యే విధంగా సరళంగా ఉంది. అందరి జీవితంలో అనివార్యంగా వచ్చే వృద్ధాప్యం, దాని వల్ల వచ్చే బాధల పట్ల సరైన అవగాహన కలిగి తగు రీతిలో స్పందించడమే నేటి యువత వయసులో పెద్ద వాళ్లకు చూపించే నిజమైన గౌరవం, సంస్కారమని 'రిక్షా తాత' కథ, 'పలకరిస్తే... పరమానందమే...' అన్న వ్యాసం సందేశాన్నిస్తున్నాయి. మంచి అంశాలు ప్రచురిస్తున్నందుకు ధన్యవాదాలు.

ఖైరి సత్యనారాయణ, కొత్తగూడెం.

నోరూరించిన 'సోయా'

కవర్ స్టోరీ 'సముద్ర గర్భంలో నిశ్శబ్ద గమనం' విజ్ఞానదాయకంగా వుంది. మాకు తెలియని ఎన్నో విషయాలను ఈ వ్యాసం ద్వారా తెలియజేశారు. కృతజ్ఞతలు. సోయా వంటకాలు నోరూరిస్తున్నాయి. ఈ పేజీలో అందిస్తున్న సమాచారం ఉపయోగంగా ఉంటోంది.

టి. శ్రీరామమూర్తి, గాజువాక.

అలరించిన జైపూర్ అందాలు

గులాబీ నగరం, జైపూర్ అందాలు అలరించాయి. నేటికీ జైపూర్ ప్యాలెస్‌లోని చారిత్రాత్మక కట్టడాలు, శిల్పాలు చూసిన వారికి ఎంతో అద్భుతంగా కనిపిస్తాయి. నీలినగరమైన జోధ్‌పూర్‌లోని రాజా జస్వంత్ సింగ్ విమానాశ్రయం, చిత్రా ప్యాలెస్ లోని దూరదర్శిని చెప్పదగినవి.

ఆచార్య నూతి నారాయణరావు, గడ్డి అన్నారం.

మందు నిజాలు

తొమ్మిదో తారీకు నాటి స్నేహలో అట్టమీది కథగా వచ్చిన 'సముద్రగర్భంలో నిశ్శబ్ద గమనం' విశ్లేషణాత్మకంగా, ఆసక్తికరంగా సాగింది. పుల్లాచారిగారి 'రిక్షాతాత' కథ బావుంది. 'తెల్సా' అంశాలన్నీ ఔరా అనిపించాయి. 'బాల నేస్తాలు' కాలక్షేపంగా అలరించింది. 'ఆకాశం విరిగి పడింది' రంగుల బొమ్మలతో కథ బావుంది. నోరూరించే చిత్రాలు... ప్రకృతి ఆరాధకులను ఆహ్లాదపరిచేలా ఉన్నాయి. 'ఈ పేజీ' విలువైన విషయ సరంజామాని అందిస్తుండడం గమనార్హం. 'కవిత్వమ్' పేజీ ఉన్నత భావాల పరంపరతో కవితలన్నీ చదివింపజేస్తున్నాయి. 'సినిమా కబుర్లు'లో జనం లేకపోయినా 'హౌస్‌ఫుల్' వంటి నగ్న సత్యాలు





ఉదహరించడం బావుంది. 'చూద్దామా..' అంటూ మా అందరినీ జైపూర్‌కు కొనిపోయిన మైత్రికి కృతజ్ఞతలు. 'వికాసం' ద్వారా పెద్దల్ని పలకరింపుతో ఆనందపరచాలని గ్రహించాం. 'మనలో మాట' మందు నిజాలను ప్రస్తావించింది. ప్రజలెంత సర్వనాశనమైపోయినా ప్రభుత్వానికి పట్టడం లేదు. ప్రజా సంక్షేమం కంటే ఆదాయమే ముఖ్యమైపోయింది. ప్రజలే తమ శక్తివంతమైన ఓటుతో నాయకులకు తగిన బుద్ధి చెప్పడం తప్పనిసరి.

నేమాన సుభాష్‌చంద్రబోస్, శ్రీకాకుళం.

నిజంగా పరమానందమే

కొత్త పుస్తకాల్లో 'మహిళలు – సోషలిజం' పుస్తకం గురించి విశ్లేషించిన తీరు బాగుంది. ఈ పుస్తకం తెలుగులో వస్తే సామాన్యులు చదవడానికి వీలుగా వుంటుంది. ఈ వారం అట్టమీది కథగా వచ్చిన 'సముద్ర గర్భంలో నిశ్శబ్ద గమనం' చదివి జలాంతర్గాముల గురించి సవివరంగా తెలుసుకున్నాం. పచ్చబొట్లు వేసే చిన్నారిని చూసి ముక్కున వేలేసుకోవాల్సిందే! పెద్దల మనసు తెలుసుకుని మసలుకోవాలన్న 'పలకరిస్తే... పరమానందమే!' అందరూ ఆచరించదగినది. అలాగే కథ కూడా చాలా బాగుంది.

సుజాత, తెనాలి.



క్యారెట్ మటర్ ఇడ్లీ

కావలసిన పదార్థాలు

రవ్వ - 1 కప్పు
కరివేపాకు - 2 రెమ్మలు
వేయించిన పల్లీలు - 100 గ్రా
పెరుగు - 2 కప్పులు
బఠాణీలు - 1 కప్పు
తరిగిన క్యారెట్ - 1 కప్పు

తయారు చేసే పద్ధతి

బఠాణీలను మిక్సీలో వేసి మెత్తగా చేయాలి. రవ్వను బాండీలో వేసి వేయించాలి. అందులోనే పల్లీలు, కరివేపాకు వేసి సన్నని సెగ మీద వేయించి చల్లార్చాలి. ఇందులో నూరిన బఠాణీ పొడి, తురిమిన క్యారెట్, పెరుగు కలపాలి. ఈ మిశ్రమాన్ని ఇడ్లీ పాత్రలో వేసి 20 నిమిషాలు ఉడకనిస్తే చాలు. క్యారెట్ మటర్ ఇడ్లీ తయార్.

పండ్లతో పెరుగు పచ్చడి

కావలసిన పదార్థాలు

పెరుగు - పావు లీటరు, చక్కెర - 4 స్పూన్లు
నూనె - 2 స్పూన్లు, ఆవాలు - అర స్పూను
కరివేపాకు - 2 రెమ్మలు
ద్రాక్ష, మామిడి, సీమరేగు పండ్లు, ఆపిల్ ముక్కలు - 2 కప్పులు

తయారు చేసే పద్ధతి

పెరుగును బాగా చిలకాలి. అందులో చక్కెరను పొడి చేసి కలపాలి. పండ్లను చిన్న చిన్న ముక్కలుగా చేసి పెరుగులో కలపాలి. నూనె వేడి చేసి అందులో ఆవాలు, కరివేపాకు వేసి వేయించాలి. ఈ తిరగమోతను పెరుగుమీద వేసి కలిపితే పండ్ల పెరుగు పచ్చడి రెడీ. దీన్ని పులావ్‌తో తింటే చాలా బావుంటుంది.





పనస పులావ్

కావలసిన పదార్థాలు

బియ్యం - 2 కప్పులు
తొక్క తీసిన పనస ముక్కలు (చిన్నగా తరిగినవి) - 200గ్రా
బిర్యానీ మసాలా - 2 స్పూన్లు
నెయ్యి - 3 స్పూన్లు
వేయించిన ఉల్లిపాయ ముక్కలు - చిన్న కప్పు (గార్నిష్ కోసం)
జీలకర్ర పొడి - 1 స్పూను
పచ్చిమిర్చి - 2
ఉప్పు - తగినంత

తయారు చేసే పద్ధతి

బియ్యాన్ని అరగంట నానబెట్టాలి. పనస ముక్కల్ని ఐదు నిమిషాలు ఉప్పు నీళ్లల్లో ఉడకబెట్టాలి. తర్వాత ఆ నీళ్లను పారబోసి వాటిని తడి లేకుండా ఆరబెట్టాలి. నూనె వేడి చేసి ఆ పనసముక్కల్ని వేయించాలి. అందులోనే జీలకర్ర, పచ్చిమిర్చి వేసి వేయించి పక్కన పెట్టుకోవాలి. నానబెట్టిన బియ్యాన్ని మూడు కప్పుల నీళ్లలో ఉడికించాలి. బియ్యం సగం ఉడికాక పనస ముక్కల మిశ్రమాన్ని, నేతిని అందులో కలపాలి. దీన్ని సన్నని సెగపై నీరంతా ఇంకి పోయేవరకు ఉడికించాలి.అంతే పనస పులావ్ రెడీ.



బ్రకోలీ కార్న్

కావలసిన పదార్థాలు

బ్రకోలీ(గ్రీన్ క్యాలీఫ్లవర్) - 200 గ్రా, మొక్కజొన్న గింజలు - 1 కప్పు
ఆలివ్ ఆయిల్ - 2 పెద్ద స్పూన్లు, మిరియాల పొడి - అర స్పూన్
మిక్స్‌డ్ హెర్బల్ పౌడర్ - అర స్పూన్, పాపిడీ - 15
ఉప్పు - తగినంత

తయారు చేసే పద్ధతి

బ్రకోలీని చిన్న ముక్కలుగా కోయాలి. నూనె వేడి చేసి అందులో బ్రకోలీ ముక్కల్ని, మొక్కజొన్న గింజల్ని మూడు నిమిషాలు వేయించాలి. తర్వాత మంట తగ్గించి ఉప్పు, మిగతా మసాలా కలపాలి. మూత పెట్టి ఉడికించాలి. పాపిడీతో అలంకరించుకోవాలి. అంతే బ్రకోలీ కార్న్ రెడీ. దీన్ని స్నాక్స్‌లా తినొచ్చు.

స్టఫ్డ్ పూరీ

కావలసిన పదార్థాలు

ధనియాలు - అర కప్పు, పుదీనా చట్నీ - అర కప్పు,
ఉప్పు - తగినంత
గోధుమ పిండి - 2 కప్పులు, నూనె - వేయించడానికి సరిపడా

తయారు చేసే పద్ధతి

గోధుమ పిండిలో ఉప్పు, పుదీనా చట్నీ, నూనె వేసి చపాతీ పిండిలా కలపాలి. దీన్ని చిన్న చిన్న ఉండలు చేసి పూరీల్లా వత్తాలి. బాండీలో నూనె వేడి చేసి అందులో పూరీలు వేయించాలి. మామూలు పూరీలంటేనే పిల్లలకు ఇష్టం కదా. వీటినైతే ఇంకా ఇష్టంగా తింటారు.

ఔరా... సాహస బాలలు...

ఏటా సాహసబాలల అవార్డులకు ఎవరు ఎంపికయ్యారా? అని ఆసక్తితో ఎదురుచూసే వారికేం కొదవలేదు. సాహస కృత్యాలతో తోటివారిని కాపాడిన పిల్లలకు ప్రతి గణతంత్ర దినోత్సవం నాడు ఈ అవార్డులను బహూకరిస్తారు. ప్రధాని/రాష్ట్రపతి చేతుల మీదగా యావత్ భారతదేశం చూస్తుండగా అవార్డు అందుకోవడమంటే చిన్న విషయం కాదు. అయితే అందుకు వారు ప్రదర్శించిన ధైర్యసాహసాలు అనన్యసామాన్యం. మరి ఈ ఏడాది సాహసబాలల అవార్డుకు ఎంపికైన 23 మంది చిన్నారులెవరో? వారి సాహసగాథలు ఏంటో చూద్దామా!

సాహసబాలల అవార్డు (2010) కు ఎంపికైన చిన్నారుల్లో 14 మంది అబ్బాయిలు 9 మంది అమ్మాయిలు వున్నారు. ఇద్దరు మాత్రం సాహసకృత్యం చేస్తూ చనిపోయారు. అయినప్పటికీ వారు చేసిన సాహసానికి గుర్తింపుగా అవార్డుకు ఎంపికయ్యారు. కాకపోతే ఒకటే లోటు. ఈసారి మన రాష్ట్రం నుంచి ఒక్కరు కూడా ఈ అవార్డుకు ఎంపిక కాలేదు. వచ్చే సంవత్సరమైనా ఈ లోటు తీరుతుందని ఆశిద్దాం.

మొదట అవార్డుకు ఎంపికైన చిన్నారుల పేర్లు చూద్దాం. 1.జిస్మి పి.ఎం (కేరళ), 2. ప్రియాంశు జోషి (ఉత్తరాఖండ్), 3. విష్ణుదాస్ .కె (కేరళ), 4. మూనిస్ ఖాన్ (మధ్య ప్రదేశ్), 5. ఇపి బాసర్ (అరుణాచల్ ప్రదేశ్), 6. శ్రావణ్ కుమార్ (రాజస్థాన్), 7. గుర్జీవన్ సింగ్ (పంజాబ్), 8. కల్పనా సోనోవాల్ (అస్సాం), 9. రేఖామోని సోనోవాల్ (అస్సాం), 10. రాహుల్ కుర్రే (చత్తీస్ గఢ్), 11. పార్వతి అమ్లేష్ (చత్తీస్ గఢ్), 12. అనూప్ ఎం (కేరళ), 13. రాజ్ నారాయణన్ (కేరళ), 14. రోహిత్ మారుతి ములిక్ (మహారాష్ట్ర), 15. మహ్మద్ నూరుల్ హుడా (మణిపూర్), 16. ఫ్రీడీ నాంగ్‌సీజె (మేఘాలయ), 17. లవ్లీస్టార్ కె.సోఫోప్ (మేఘాలయ), 18. లాల్మా విజౌలి (మిజోరం), 19. లేట్ చంపా కన్వర్ (రాజస్థాన్), 20. వివేక్ శర్మ (సిక్కిం), 21. ఉత్తమ్ కుమార్ (ఉత్తర ప్రదేశ్), 22. లేట్ శ్రుతి లోధి (ఉత్తరాఖండ్), 23. సునీతా ముర్ము (పశ్చిమబెంగాల్).

అగ్నికి ఆహుతి కాకుండా...

అరుణాచల్‌ప్రదేశ్ బాలిక ఇపి బాసర్. ఇద్దరి ప్రాణాలు కాపాడడానికి ధైర్యంగా మంటల్లోకి వెళ్లింది. ఏడు పదుల వయసున్న బామ్మగారిని, ఏడేళ్ల పాపను బాసర్ కాపాడింది. ఓసారి తన పొరుగింట్లో అగ్గి రగులుకుంది. ఆ మంటల్లో చిక్కుకున్న పాపను ఒక చేత్తో, పక్షవాతంతో కదల్లేకున్న బామ్మను మరో చేత్తో బలమంతా ఉపయోగించి బయటకు లాక్కొచ్చింది. అంతేకాదు! ఇంట్లో వున్న గ్యాస్ బండను కూడా బయటకు లాక్కొచ్చింది. మంటల్లో చిక్కుకుంటే పేలుతుందన్న ఆలోచనతోనే అలా చేసింది బాసర్. పాపలోని ధైర్యం, పట్టుదల, ఆత్మవిశ్వాసం మోయలేని బరువును కూడా సులభంగా తీసుకొచ్చేలా చేసింది. తన వయసుకు మించిన సాహసం చేసినా... అప్పటికి అంత వరకు మాత్రమే చేయగలిగానంటోందా పిడుగు వినయంగా. ఇద్దరి ప్రాణాలను కాపాడిన బాసర్‌ను ఇరుగుపొరుగు, రాష్ట్ర అధికారులు అంతా ప్రశంసించారు. పెద్దయ్యాక లాయర్ కావాలన్నది తన కోరిక.

రైలు దుర్ఘటనలో చనిపోకుండా కాపాడాడు

భోపాల్‌కు చెందిన మూనిస్ ఖాన్ 55 ఏళ్ల వ్యక్తి ప్రాణాలు కాపాడాడు. 12వ తరగతి బోర్డు పరీక్షలకు సిద్ధమౌతున్న మూనిస్ ఓసారి క్లాసు నుంచి తిరిగి ఇంటికి వస్తున్నాడు. అప్పుడు రైల్వే ట్రాక్ మీద ఓ వ్యక్తి కూర్చుని కనిపించాడు. ఓ పక్క రైలు వేగంగా వస్తోంది. చుట్టుపక్కల వారంతా భయంతో కేకలు పెడుతున్నారు. అతను కదలలేని స్థితిలో వున్నాడు. అప్పుడు మూనిస్ మనసులో ఒకటే ఆలోచన. అతణ్ణి ఎలాగైనా కాపాడాలి. అంతే! అంతా అలా చూస్తుండగానే పరుగెత్తుకుంటూ వెళ్లి ఒక్క ఉదుటున

రక్షించాలనుకొన్నాడు. రైలు ఇంకా ఐదు మీటర్ల దూరంలో వుందనగా అతణ్ణి కాపాడాడు.

నీళ్లలో మునిగిపోయేవారిని రక్షించారు

కేరళకు చెందిన జిస్మి, విష్ణుదాస్, అనూప్, రాజ్ నారాయణన్ నలుగురూ నలుగురే. నాలుగు వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన సంఘటనల్లో నీళ్లల్లో మునిగిపోతున్న వారిని కాపాడారు.

జిస్మి పి.ఎంకు పన్నెండేళ్లు. త్రిసూర్ జిల్లా వాసి. ఓసారి బట్టలు ఉతకడానికి వెళ్లింది. చెరువులో మునిగిపోతున్న ఇద్దరు పిల్లలను కాపాడింది. చిన్నారుల్లో ఒకరికి 8, మరొకరికి 9 ఏళ్లు. పదిహేను అడుగుల లోతున్న నీటిలోకి దూకి ప్రాణాలు కాపాడడమంటే చిన్న విషయం కాదు. అందుకే గీతా చోప్రా అవార్డుకు ఎంపికయ్యింది పిడుగు. జిస్మి చెర్పులోని గవర్నమెంట్ ఒకేషనల్ హయ్యర్ సెకండరీ స్కూల్లో చదువుతోంది. అన్నిటికంటే ముఖ్యమైన విషయమేమంటే ఈ పాప కూలీనాలీ చేసుకునే మురళి, బిందు దంపతుల కుమార్తె. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అయ్యి పేదవాళ్లకు సాయం చేయాలన్నది చిన్నారి కల.

ఇంక విష్ణు దాస్‌ది మరో సాహస గాథ. మునిగిపోతున్న తల్లిని కాపాడలేకపోయినా...ఆమె ఇద్దరు కుమార్తెలను రక్షించి బాపుగయాధని అవార్డును కైవసం చేసుకొన్నాడు. లక్కిడికి చెందిన రామదాస్, షర్మిల దంపతుల ఏకైక సంతానం విష్ణు.

అనూప్‌కు తొమ్మిదేళ్లే. అయితేనేం గుండెధైర్యంలో దిట్ట. నీళ్లల్లో మునిగిపోతున్న ఐదేళ్ల పాపను కాపాడాడు. మధుసూదన్, ఉమాదేవి దంపతుల సంతానమైన అనూప్ చంబక్కులమ్ బిషప్ పబ్లిక్ స్కూల్లో చదువుతున్నాడు. ఇక రాజ్ నారాయణన్! తన కంటే ఒక క్లాసు ఎక్కువ చదివే అబ్బాయిని చెరువులో మునిగిపోకుండా కాపాడాడు.

మణిపురి పిడుగు ఎం.డి. నూరుల్ హుడా రిపబ్లిక్ డే రోజు సాహసబాలల అవార్డు అందుకోడానికి సన్నద్ధమౌతున్నాడు. తను ఇంఫాల్ నదిలో పడి కొట్టుకుపోతున్న గిరిజన బాలుణ్ణి కాపాడాడు.

ఫ్రీడీ నాంగ్‌సీజె మేఘాలయకు చెందిన బాలుడు. తనకు మూడేళ్ల వయసులో మూర్ఛవ్యాధి వున్నట్టు నిర్ధారణ అయ్యింది. అనారోగ్యంతోనే దైనందిన జీవితంలో ఎదురయ్యే కష్టనష్టాలను ఎలా ఎదుర్కోవాలో నేర్చుకున్నాడు. ఓసారి ఫ్రీడీకి ఉమ్రాన్ నది దగ్గర మార్గరెట్ అనే మహిళ పెట్టిన కేకలు వినిపించాయి. తీరా చూస్తే మార్గరెట్ కుమారుడు నీళ్లలో కొట్టుకుపోతూ కనిపించాడు. మరో ఆలోచన లేకుండా నదిలోకి దూకాడు ఫ్రీడీ. పిల్లవాడి దగ్గరకు ఈదుకొంటూ వెళ్లి బయటకు లాక్కురాబోయాడు. కానీ వీలవలా. మళ్లీ రెండవ ప్రయత్నం చేశాడు. అప్పుడు సాధించాడు. అప్పుడు మార్గరెట్ పాలిట దేవుడిలా కనిపించాడు ఫ్రీడీ.

న్యాయం కోసం నిలబడింది

పదహారేళ్ల సునీతా ముర్ము పశ్చిమబెంగాల్‌కు చెందిన గిరిజన బాలిక. గిరిజనేతర వ్యక్తితో ప్రేమలో పడిందన్న అనుమాన బీజం తెగ పెద్దల్లో మొలకెత్తింది. ఆగ్రహావేశాలతో ఊగిపోతూ ఉచితానుచితాలను మరిచి ముర్మును వివస్త్రను చేసి నగ్నంగా ఊరేగించారు. వందలాది మంది జనం చూస్తుండగా...డప్పులు మోగుతుండగా... 8 కిలోమీటర్ల దూరం ... 4 గ్రామాలలో నగ్నంగా నడిపించారామెను. తనపై బహిరంగంగా, లైంగికంగా చేసిన వేధింపులకు వ్యతిరేకంగా పోరాడాలనుకొంది. పోలీసులను ఆశ్రయించింది. అయితే కేసు పెడితే సొంత తెగ నుంచి బహిష్కారానికి గురికావాల్సి వస్తుందని తల్లిదండ్రులు భయపడి మిన్నకుండిపోయారు. కానీ ముర్ము లెక్క చేయలేదు. కేసు పెట్టింది. నేరస్థులను గుర్తించడంలో చట్టానికి సహకరించింది. అందుకుగాను ముర్ము సాహస బాలల అవార్డు అందుకోనుంది. ప్రస్తుతం గవర్నమెంట్ హోమ్‌లో స్వాంతన పొందుతున్న ముర్ము సొంత గ్రామానికి మాత్రం వెళ్లనంటోంది. కుటుంబ సభ్యుల ప్రేమానురాగాలకు దూరంగా వుండడానికైనా సిద్ధపడుతోందిగానీ ఊళ్లోకి మాత్రం పోనంటోంది. తెలీని భయం, సిగ్గు ఆమెను ఆపివేస్తున్నాయి.

పులిపై పోరాటం

ఉత్తరాఖండ్‌కు చెందిన ప్రియాంశు జోషికి ప్రఖ్యాత సంజయ్ చోప్రా అవార్డు వచ్చింది. ఎప్పటిలాగే ప్రియాంశు తన సోదరితో కలిసి స్కూలుకు వెళుతున్నాడు. అయితే మార్గమధ్యలో వారిమీద పులి దాడి చేసింది. చేతిలో వున్న పుస్తకాల సంచితోనే పులిని ఎదుర్కొన్నాడు ప్రియాంశు. అకస్మాత్తుగా పులిని చూస్తే ఎవరికైనా గుండె ఆగినంత పనౌతుంది. భయంతో ఏం చేయాలో తోచదు. కానీ పదమూడేళ్ల ప్రియాంశు చాలా తెలివిగా, ప్రాణాలకు తెగించి చెల్లెలిని కాపాడాడు.

అందరిలోకి పిన్నవాడు

సాహసబాలల అవార్డు అందుకోబోతున్న పిల్లలందరిలోకి పిన్నవాడు రాజస్థాన్‌కు చెందిన శ్రావణ్ కుమార్. సర్నేశ్వర్ గ్రామంలో జరిగిన అగ్నిప్రమాదానికి ఆహుతి కాకుండా ఇద్దరు అక్కాచెల్లెళ్లను కాపాడాడీ పిడుగు. వారిలో ఒకరికి ఒకటిన్నరేళ్లు కాగా మరొకరికి రెండున్నరేళ్లు.

మిద్దెపైనుంచి పడిపోతున్న పాపను కాపాడి..

వివేక్ శర్మ పదకొండేళ్ల సిక్కిం పిల్లవాడు. పసివాడైతేనేం ఏడేళ్ల చిన్నారిని కాపాడాడు. అదీ భవనం రెండో అంతస్థునుంచి పడిపోతున్న పాపను. చేత్తో పట్టుకొని రక్షించబోయి పాపతో సహా తనూ కిందపడ్డాడు. గాయాలపాలైన ఇద్దరు చిన్నారులను ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. అందుకుగాను సాహసబాలల అవార్డుకు ఎంపికయ్యాడు వివేక్. "ఒక పాప ప్రాణం కాపాడినందుకు నాకు చాలా గర్వంగా వుంది. ఒకరికొకరు సాయం చేసుకోవాలన్నది నా కోరిక" అని చెప్తున్నాడు పెద్ద ఆరిందలా.

పక్కవారిని కాపాడబోయి ప్రాణాలే వదిలేసింది

శ్రుతి లోధి పదమూడేళ్ల రాజస్థానీ పాప. గత ఏడాది డయాబెటిస్ రోగుల కోసం ఓ ఎన్జీఓ సంస్థ నిర్వహించిన 'రన్ టు లివ్' కార్యక్రమంలో పాల్గొంది. పరుగెత్తే సమయంలో అకస్మాత్తుగా ఓ వృక్షం వచ్చి ఆమె మీద పడింది. అలాంటప్పుడు కూడా పక్కవారిని చెట్టుకింద పడకుండా చేత్తో తోసేసి...ఆగిపొమ్మంటూ కేకలు పెట్టింది. కానీ తనను తాను కాపాడుకోలేకపోయింది. పరుల కోసం ప్రాణాలను పణంగా పెట్టిన తన ముద్దులు కూతురు సాహసబాలల అవార్డుకు ఎంపికైందని తెలిసి శ్రుతి తల్లి కళ్లనీళ్ల పర్యంతమౌతోంది. "శ్రుతి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ కావాలనుకొంది. కానీ మాకు మిగల్లేదు. తను మా ఒక్కగానొక్క బిడ్డ" అంటోంది. రాజస్థాన్‌కు చెందిన చంపా కన్వర్, కూడా ఇతరుల ప్రాణాలు కాపాడే క్రమంలో అసువులు బాసింది. అందుకు గాను వీరిరువురూ సాహసబాలల అవార్డుకు ఎంపికయ్యారు.

దొంగల పనిపట్టి...

బ్యాంకు దోపిడీ చేయబోయిన దొంగల పని పట్టాడు గుర్జీవన్ సింగ్. పదకొండేళ్ల పంజాబీ పిడుగు దోపిడీని అడ్డుకున్నాడు. అదీ తనకు అందుబాటులో వున్న ఇటుకరాళ్లతో అంటే కాస్త ఆశ్చర్యం కలుగుతుంది. దొంగలు ఊరుకుంటారా! గుర్జీవన్‌పై తుపాకీతో కాల్పులు జరిపారు. అయినప్పటికీ ఇటుకలు విసురుతూ పోరాడాడు. రాళ్లు తగిలి వారి చేతిలోని పిస్టల్ జారి కిందపడింది. అలా ఎట్టకేలకు వారిని అడ్డుకోవడమేకాక పట్టుబడేలా చేశాడు. ఇదీ గుర్జీవన్ సాహసగాథ.

వీరందరూ జనవరి 26న జరిగే గణతంత్ర దినోత్సవ వేడుకల్లో సాహసబాలల అవార్డును ప్రధాని మన్మోహన్ సింగ్ చేతుల మీదుగా అందుకొంటారు. వీరు చేసిన సాహసకృత్యాలకు గుర్తుగా ఒక మెడల్, సర్టిఫికెట్, నగదు అందిస్తారు. పైగా పాఠశాల చదువుకుగాను ప్రభుత్వ సాయం అందుతుంది. ఇంజనీరింగ్, మెడికల్, పాలిటెక్నిక్ కాలేజీల్లో వీరికి సీట్ల రిజర్వేషన్ వుంటుంది. మరి వచ్చే ఏడాది సాహసబాలలు ఎవరో! ఎదురుచూద్దాం!!

- కె.సాహిల్

స్నేహం

ఎవరున్నా లేకున్నా
నేమున్నానంటు మిత్రుడున్న
రోజంతా ఉత్సాహం
జీవితమంతా ఆనందం
సమస్యలెన్ని ఉన్నా
ఉపాయాల కొదువలేదు

కుచేలునకు కృష్ణుడు
మంచి చెలికాడుకదా!
నోరు తెరిచి అడగకున్నా
సమస్యల సాధనకు నిలిచాడు
అష్టైశ్వర్యాలు ఇచ్చాడు
ఓ మానవా! తిన్నా తినకున్నా
పని చేసినా! చేయకున్నా
మాటాడినా మౌనంగా ఉన్నా
సంపాదించు ఎల్లవేళల



ఒకరికొకరు బాసటగా
నిలిచి చింతన చేయగా
కష్టాలన్నీ వెనుచూపును
అపాయాలు అనుమానాలు
అవహేళనలు చుట్టుముట్టినా
స్నేహమే వాటిని తుదముట్టించు

స్నేహితుల సాంగత్యం
స్నేహితుల సహవాసం

- పెందోట వెంకటేశ్వర్లు

ప్రతిరోజూ ....

ఒక రాశి నుండి మరో రాశిలోకి మారే
సూర్యుళ్లున్న నాదేశంలో
రంగులు చల్లి, జనాన్ని ముగ్గులోకి దింపే
ముంగిళ్లున్న నాదేశంలో
అవినీతి గడ్డి మేస్తూ, పై వాడి మెప్పుకోసం
ఊపే తలలున్న నాదేశంలో
చెక్క భజన గీతాలు
అక్షయ పాత్రల్ని నింపుకునే నాదేశంలో
సమస్యలు ఉద్యమాలై
కోడిపందేలాడుకునే నా దేశంలో
ప్రతిరోజూ సంక్రాంతే!
సుఖశాంతులకు ఎప్పుడూ విశ్రాంతే!

-డా॥రామడుగు వెంకటేశ్వర శర్మ

కవిత్వమ్

కొన్ని క్షణాలు

ఎందుకో కొన్ని క్షణాలు
అనుభవాల్లోకి
జారిపోతుంటాయి.
మరికొన్ని
హడావిడిగా యాంత్రికాన్ని
నెత్తిన ఎత్తుకొని
ఉరుకుల పరుగులతో
ఉలిక్కి పడుతుంటాయి.
దించలేని భారాలెన్నింటినో
కాలం తెలియకుండానే
మోసుకు పోతుంటాం.
చెట్టుకు వేలాడే పక్షుల్లా
సిటీ బస్సుల్లో
కుదుపు కుదుపుకీ
నలిగి పోతుంటాం.
కాలం చుట్టిన కంచెలో
గిలగిలలాడిపోతుంటాం.
ఆఫీసు ఫైళ్ళ మధ్య
ఆప్యాయతలూ నలిగిపోతుంటాయి



గాజు పంజరాల్లో
కాలం సమాధి అవుతుంది.
ఏ వసంతాన్నో
ఏ వెన్నెలనో
ఆరబోసుకుందామంటే
సాగిల పడిన క్షణాలు
సృజన లోకాన్ని
రెమ్మ రెమ్మగా రెలుస్తున్నాయి
ఇప్పుడు రెక్కలు విచ్చుకోవాలంటే
కాంతులీనే
కవిత స్పర్శ కావాలి
తడి హృదయపు స్పర్శ కావాలి.
కొన్ని క్షణాల్ని
పోగుచేసి
నూతన దృశ్యాల్ని
ఒకటి ఒకటిగా
ఆవిష్కరించాల్సి వుంది

-గవిడి శ్రీనివాస్

కొత్త పుస్తకాలు

రాష్ట్ర రాజకీయ చరిత్ర దర్శిని

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజకీయాలు, (1919- 2010), ఆచార్య మారంరాజు సత్యనారాయణరావు, వెల : 125/-, పేజీలు : 316, ప్రతులకు : ప్రజాశక్తి బుక్‌హౌస్, 1-1-187/1/2, చిక్కడపల్లి, హైదరాబాద్ -20, మరియు ప్రజాశక్తి అన్ని బ్రాంచీలు.

రాష్ట్ర రాజకీయ పరిణామాలను సాకల్యంగా పరిచయం చేసే పుస్తకం 'ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర రాజకీయాలు' (1919-2010). రాజకీయ శాస్త్రంలో విస్తారమైన అనుభవం గల అధ్యాపకుడు, విద్యావేత్త ఆచార్య మారం రాజు సత్యనారాయణ ఈ పుస్తకం రాశారు. 1993లో తొలిసారి వెలువడిన ఈ గ్రంథం స్వల్ప మార్పులతో, ముగింపు అధ్యాయంతో పునర్ముద్రణ వెలువడింది. ఆంధ్రప్రదేశ్ ఇటీవలి చరిత్ర తెలుసుకోవాలనుకునే వారికి ఎంతైనా ఉపయోగకారి.

రాష్ట్ర చరిత్ర ప్రధానంగా తీసుకోవడం వల్ల అందుకు సంబంధించిన వివిధ అంశాలనూ ఘట్టాలను పరిశీలించే అవకాశం కలిగింది. 1919లో మాంటేగ్ చేమ్స్‌ఫర్డ్ సంస్కరణలు వచ్చినందున ఆ దశనుంచి మొదలు పెట్టారు. మొదటి అధ్యాయంలో రాష్ట్ర రాజకీయ అధ్యయనాల కొరతను, ఇప్పటి వరకూ జరిగిన కృషిని రేఖామాత్రంగా స్పృశించారు. తర్వాత భారత సమాఖ్య రాష్ట్రాలు అన్న అధ్యాయంలో బ్రిటిష్ వారి కాలంలో రాష్ట్రాల తీరు, తర్వాత వాటిని పునర్వ్యవస్థీకరించడం వంటి విషయాలు వివరించారు. ఈ అధ్యాయం చదివితే రాష్ట్రాల అవతరణకు సంబంధించిన అనేక అవాస్తవ భావనలు సరి చేసుకోవచ్చు. ఆంధ్రప్రదేశ్ ఆవిర్భావానికి సంబంధించిన తదుపరి అధ్యాయం మొదటి నుంచి పాలక వర్గ నేతలు ఎన్ని కుటిలోపాయాలకు పాల్పడుతూ మాటలు మార్చుతూ వచ్చారో సోదాహరణంగా చెబుతుంది. గవర్నరు, న్యాయ వ్యవస్థ, సచివాలయం అన్న భాగాల్లో రచయిత ఈ వ్యవస్థల తీరు తెన్నులు ఎరుక పర్చారు. ముఖ్యమంత్రి అన్న అధ్యాయంలో ఇప్పటి వరకూ వచ్చిన ముఖ్యమంత్రుల నేపథ్యం, ఎంపిక తీరు, వారి వారి రాజకీయ వ్యూహాలు అనుకూల ప్రతికూలాంశాలు, ముఠా తగవులు వగైరా అంశాలను సుబోధకంగానూ చారిత్రికంగానూ విశ్లేషించారు. ఇదే కోవలో మంత్రివర్గాల స్థాపన, పునర్వ్యవస్థీకరణ తదితర విషయాలనూ పొందుపర్చారు.

ఉద్యమాలు అన్న భాగంలో 'విశాఖ ఉక్కు, ప్రత్యేక తెలంగాణా, జై ఆంధ్ర...' తదితర ఉద్యమాల పూర్వాపరాలు పరిశీలించారు. ప్రాంతీయ ఉద్యమాల పూర్వ రూపాన్ని తెలుసుకోవడానికి, అందులో నాయకుల పిల్లిమొగ్గలు అర్థం కావడానికి ఈ భాగం బాగా ఉపయోగపడుతుంది. ఫ్యూడల్ నైజాం పాలన వల్ల కలిగిన వెనకబాటు తెలంగాణాకు చేసిన అన్యాయం, దాన్ని సరిదిద్దేందుకు ప్రత్యేక చర్యలూ హామీల అమలు కొరవడడం 1969లో చెన్నారెడ్డి వంటి నాయకుల ముఠాల ప్రయోజనాల సాధనకు ఎలా ఉపయోగపడిందో తెలిపారు. అలాగే ముల్కీ తీర్పు తర్వాత జై ఆంధ్ర' ఉద్యమం పేరిట అదే పాలక పక్షీయులు విభజన కోసం సృష్టించిన ఉద్రిక్తతలను కూడా సాకల్యంగా పరిశీలించారు. "చారిత్రిక రాజకీయ కారణాలు ప్రాంతీయ సమస్యలను సృష్టించి రాజకీయ ఉప సంస్కృతుల వృద్ధిని ప్రోత్సహిస్తాయి. ఇది రాజకీయ సంస్కృతితో ఘర్షణ పడుతుంది అన్న డంకన్ ఫారెస్టర్ వ్యాఖ్యను ఉటంకించారు. ఈ విషయంలో రెండు ప్రాంతాల మధ్య చారిత్రిక నేపథ్యాలలో తేడాలను కూడా పేర్కొన్నారు. రెండు సందర్భాలలోనూ రాజీనామాలతో సంక్షోభాలను తీవ్రం చేసిన నాయకులు తర్వాత అధికార చట్రంలో ఇమిడిపోయిన వైనాన్ని కూడా గ్రంథస్థం చేశారు. అప్పటికీ ఇప్పటికీ ప్రాంతీయ ఉద్యమాల్లో సహజంగానే తేడాలున్నా పాలకుల ధోరణిలో వర్గ వ్యూహాలలో పెద్ద తేడా లేదని తెలుసుకోవడానికి ఈ భాగం ఉపయోగపడుతుంది. ఇదే రీతిలో. రాజకీయ పార్టీలు, ఎన్నికలు అన్న అధ్యాయాలు కూడా వున్నాయి. కొనసాగింపు పేరిట రాసిన ఆఖరి భాగంలో 1994-2010 పరిణామాలను క్లుప్తంగా క్రోడీకరించారు. అంతేగాక ఎన్నికల బలాబలాల పట్టికలు, మంత్రివర్గాల జాబితాలు ఇవ్వడం కూడా ఈ అవగాహనకు దోహదపడే రీతిలో వుంది.

శ్రీకృష్ణ కమిటీ నివేదిక, ప్రాంతీయ వ్యూహాలపై తర్జనభర్జనలు సాగుతున్న నేటి సందర్భంలో ఈ పుస్తకం ప్రత్యేకంగా ఆసక్తి కలిగిస్తుంది. రాష్ట్ర రాజకీయ చరిత్రను విహంగ వీక్షణం చేయిస్తుంది.

తెలుగు వీరుడి విమల చరిత్ర

అల్లూరి సీతారామరాజు డా॥అట్లూరి మురళి వెల : 30/-, పేజీలు : 112, ప్రతులకు : ప్రజాశక్తి బుక్‌హౌస్, 1-1-187/1/2, చిక్కడపల్లి, హైదరాబాద్ -20, మరియు ప్రజాశక్తి అన్ని బ్రాంచీలు.

'తెలుగు వీర లేవరా దీక్ష బూని సాగరా...' అనగానే అల్లూరి సీతారామరాజు మూర్తి కళ్లముందు సాక్షాత్కరిస్తుంది. మన్య విప్లవ వీరుడుగా అల్లూరి తెలుగు వారందరికీ నిరంతర ఉత్తేజ ప్రదాత. ఆయన జీవితంపై లోగడ కొన్ని పుస్తకాలు వచ్చాయి. ఈ పుస్తకం వాటికి విలువైన చేర్పు. చరిత్ర ప్రొఫెసర్ అట్లూరి మురళి అల్లూరి జీవితంపై అందుబాటులో వున్న సమాచారాన్ని, పురాతన పత్రాల భాండాగారాన్ని శోధించి లోగడ మన్యవిప్లవంపై ఒక పరిశోధనా పత్రం వెలువరించారు. 70 పేజీల ఈ పత్రంతో పాటు మరికొన్ని వ్యాసాలను, విశేషాలను కలిపి 'అల్లూరి సీతారామరాజు' అన్న ఈ పుస్తకం తీసుకొచ్చారు. రెండవ భాగంలో మన్య విప్లవ ఘట్టాలపై పరుచూరి కోటేశ్వరరావు రాసిన వివరాలున్నాయి. అల్లూరి బాల్యమిత్రుడైన మద్దూరి అన్నపూర్ణయ్య జ్ఞాపకాలు, అల్లూరి రాసిన లేఖల నకళ్లు, పోలీసులకు పంపిన టపాలు, నాటి అధికారుల నివేదికలు, అల్లూరి కాల్చివేతపై పత్రికల కథనాలు, ఫొటోలు తదితర విశేషాలను మూడవ భాగంలో చూడవచ్చు. ఆయనపై వచ్చిన కొన్ని కవితలు, పాటలు ఆఖరున చోటు చేసుకున్నాయి.కాకపోతే రామరాజు ఉత్తరాలు మినహా స్వయంగా రాసిన రచనలు ఇప్పటికీ లభించలేదు. ఆయనపై వెలువడిన రచనలే వుంటాయి. గతంలో ప్రజాశక్తి ప్రచురించిన భగత్ సింగ్ జీవితం రచనల పుస్తకం లాగే ఇది కూడా ఉద్యమకారులకు ప్రత్యేకించి యువతకు మంచి వనరు. ఈనాటికీ మారని గిరిజనుల వెతలను బాపేందుకు జరిగే పోరాటానికి అల్లూరి, కొమరం భీం వంటి వారి జీవితాలు ప్రత్యక్ష ప్రేరణనివ్వగలవు.

సరికొత్తగా..కాస్త క్లుప్తంగా 'అమ్మ'

అమ్మ, మాక్సీమ్ గోర్కీ వెల : 75/-, పేజీలు : 229, ప్రతులకు : ప్రజాశక్తి బుక్‌హౌస్, 1-1-187/1/2, చిక్కడపల్లి, హైదరాబాద్ -20, మరియు ప్రజాశక్తి అన్ని బ్రాంచీలు.

ఎప్పటికీ ఆకుపచ్చగా వుండే నిత్య చైతన్యం లాంటి నవల అమ్మ. మాగ్జిం గోర్కీ విరచితమైన ఈ రష్యన్ నవల పాత సమాజం ప్రతిరూపం అమ్మ. దాన్ని మార్చేందుకు మహా ప్రస్థానం సాగించే ఆశయధనులు జరిపే మహా ప్రస్థానంలో భాగంగా తను జరిపే పోరాటం 'అమ్మ'కు అజరామరత్వం కలిగించింది. జీవితాన్ని కాచి వడబోసిన పోరాట వీరుడు కలం యోధుడు గోర్కీ సృష్టించిన ఈ 'అమ్మ' 1906 మొదటిగా వెలువడింది. దాన్ని లక్షల ప్రతులు ముద్రించి పంపిణీ చేయాలని లెనిన్ ఆకాంక్షించాడు. ఆయన ఆశించిన దానికి మించి అమ్మ విశ్వ విప్లవ కారుల ఉత్తేజ దాయినిగా వెలుగొందుతూనే వుంది. ప్రజాశక్తి ఈ పుస్తకాన్ని కొద్దిగా క్లుప్తీకరించి 230 పేజీలతో సరికొత్త ముద్రణ తీసుకొచ్చింది. ఈ సందర్భంగా కథన క్రమం ఏ మాత్రం దెబ్బ తినకుండా జాగ్రత్త తీసుకోవడం వల్ల వేగంగానూ బిగువుగానూ సాగుతుంది. పుస్తకం రాజకీయ సాహిత్య నేపథ్యాన్ని వివరించే సవివరమైన ఉపోద్ఘాతం కూడా జత చేయడం సముచితంగా వుంది. కార్మిక వర్గ స్ఫూర్తిని ప్రతిబింబించిన తొలి అంతర్జాతీయ నవలగా చెప్పదగిన ఈ మహాగ్రంథం ఇప్పుడు చదివినా నేటి పరిస్థితిని తలపించడం గోర్కీ రచనా పటిమకు తార్కాణం.

- భారతి

వియత్నాం వీరుడు ఎన్గుయెన్ వాన్‌ట్రాయ్

కథనం: ఫాన్-థి-కుయేన్
అనువాదం: పాటూరి రామయ్య

జరిగిన కథ

ట్రాయ్ ఉరితీత వాయిదా పడిందని తెలిసి జనాల్లో చర్చ మొదలౌతుంది. ఎక్కడ చూసినా ఆ వార్త గురించిన కబుర్లే. కుయేన్ కూడా ఎంతగానో సంతోషిస్తుంది. తనకు ఉరి తప్పిందని తెలిస్తే ట్రాయ్ ఉక్కిరిబిక్కిరి అవుతాడని భావిస్తుంది. ఈలోపు ట్రాయ్ దగ్గర నుంచి వచ్చిన ఉత్తరం అందుతుందామెకు. వణికిపోతుంది మొదట. అయితే తనకు తలనొప్పి తైలం పంపించమని, మానసిక బాధల నుంచి బయటపడేందుకు బంధుమిత్రులను కలవమని రాస్తాడు. అలాగే తన చెల్లెలికి, తల్లిదండ్రులకు-మేనల్లుడు హువాకు ఇంటి పనులలో సహకరిస్తున్న బే సోదరునికి కూడా నాలుగు వాక్యాలు రాస్తాడు. తర్వాత ట్రాయ్‌ను కలవడానికి సిద్ధమౌతుంది కుయేన్. అతని పెళ్లి సూటు ఉతికి ఆరబెడుతుంది. విడుదలైన రోజున అదే ధరిస్తాడని ఆశిస్తుందామె. ఛిహువా జైలుకు వెళుతుంది. అక్కడ సాయుధ సైనికులు బారులు తీరి వుంటారు. అయితే ఆమెను లోనికి అనుమతించరు. శిక్షితుల వార్డు బైట పీనుగుల వ్యాన్‌ను చూస్తుందామె. అక్కడ నిలబడిన సైనికులు ఈమె గురించి మాట్లాడుకుంటారు. తర్వాత అక్కడంతా జనం గుమిగూడతారు. తనవైపు చూసి సంజ్ఞ చేసిన ఒకామె దగ్గరకు వెళుతుంది కుయేన్. ఆ తర్వాత...

(పంతొమ్మిదో భాగం)

'**తి**రిగి వెనక్కు వచ్చావెందుకు? ఆ దుర్మార్గులు నీ భర్తను చంపేందుకు సిద్ధమౌతున్నారు. అలాంటప్పుడు లోపలికెళ్లనివ్వమని ఎందుకడగవు?'

ఆమె మాటలు నమ్మశక్యం గాకుండా ఉన్నాయి. ఏమిటీ అయోమయం!

నేనిలా అన్నాను :

'లేదు ఇది నిజం కాదు. మధ్యాహ్నం ట్రాయ్‌కి భోజనం తెచ్చి ఇవ్వమని వాళ్లే చెప్పారు. పత్రికల్లో చూడలేదూ – ఆయన్ను ఉరితీయడం వాయిదా వేసిన విషయం!'

'పత్రికల్లో వచ్చిన విషయం మాకందరికీ తెలుసు. ఈ ఉదయం వరకు నువ్వు అనుభవించిన సంతోషంలో మేమూ పాలుపంచుకొన్నాం. కొన్ని సంవత్సరాలుగా ఈ జైలు వెలుపల సరుకులూ అవీ అమ్ముకుంటున్న వాళ్లమే. ఇలా ప్రాణాల మార్పిడి సంభవించడం ఇదే మొదలు. కానీ అమెరికన్ దురాక్రమణదారులు పరమ నీచులు. నమ్మక ద్రోహులు, వాళ్లమాట వాళ్లే నిలబెట్టుకోలేకపోయారు. ఒప్పందం ప్రకారం వెనిజులన్ ప్రజలు అమెరికన్ సైనికాధికారిని విడుదల చేశారు. అయినప్పటికీ ఈ ముష్కరులు నీ భర్త ప్రాణాలు తీసేందుకు సిద్ధమౌతున్నారు. కాంగ్లీ బ్రిడ్జి కింద మందు గని పాతిపెట్టిన వాడిని ఉరి తీస్తారని సాయుధ సైనికులు కూడా మాతో చెప్పారు'

ఈ మాటలు ఎలా నమ్మాలో నాకు అర్థం కాలేదు. ఇంకో ఆమె నన్ను సమీపించింది. అక్కడనే ఒక మూలకు నన్ను తీసుకెళ్ళింది. వెక్కి వెక్కి ఏడుస్తూ ఇలా చెప్పింది :

'ఆ సిపాయిలు చెప్పింది నిజం. ఈ ఉదయమే నీ భర్తను ఉరితీయబోతున్నారు. ట్రాయ్‌ని చంపేస్తారు. పీనుగుల పెట్టెకూడా లోపల సిద్ధంగా ఉంది. పత్రికలవాళ్లు, ఫోటోగ్రాఫర్లు రావడానికి సిద్ధంగా ఉన్నారు. వెళ్ళు. ఆ వార్డుకి వెళ్ళి చూడు అమ్మాయి! ఏమి జరగనున్నదో కూడా చెప్పాడు నాకు తెలిసిన ఒక సిపాయి'

ఇప్పుడు నా సందేహాలన్నింటినీ బంధించిన సంకెళ్ళు బద్దలయ్యాయి....ఏడ్చాను. వెక్కివెక్కి ఏడ్చాను. జైలుగేటు దగ్గరకు పరుగెత్తాను. గేటుకు తగిలించిన ఇనప తలుపులు గట్టిగా మూతపడి ఉన్నాయి. నన్నక్కడనుంచి కొంతమంది సాయుధ సైనికులు అవతలికి నెట్టివేశారు. నేను వాళ్ళతో కొంతసేపు పెనుగులాడాను. గావు కేకలు పెట్టాను. అరిచాను.

'మీరు నా భర్తను చంపలేరు. మీ తరం కాదు ఆయన్ను చంపడానికి ముందు ఒక్కసారి నన్ను చూడనివ్వండి'

ఒక సిపాయి నా భుజాలు పట్టి గట్టిగా లాగుతూ ఇలా అన్నాడు :

"ఎవరినీ అనుమతించేది లేదు. అది ప్రభుత్వం జారీ చేసిన ఆజ్ఞ. అనుమతి కోసం అర్జీ పెట్టుకో"

అక్కడినుండి నన్ను దూరంగా అవతలకి నెట్టివేశాడు. మరో సిపాయి మురా వచ్చింది గేటును గట్టిగా మూసి ఉంచేందుకు. శిక్షితుల వార్డువైపు చూస్తు ఉండిపోయాను. నా భర్తకోసం అరుస్తూ కేకలేస్తూనే ఉన్నాను. కాల్చి చంపడానికి ఆయన్ను మైదానంలోకి నెట్టుకెళ్తున్నారని అనుకొంటూ ఉండిపోయాను. చివరికి సిపాయి ముష్కరులు నన్నక్కడ లేకుండా నెట్టిపారేశారు. సైకిల్‌స్టాండ్ దగ్గరకు పరిగెత్తాను.

ట్రాయ్‌ని రక్షించుకునేందుకు నేను ఏమిచేయాలో నా తండ్రితో చర్చించేందుకు సైకిల్‌మీద ఒక్క ఊపుతో పరుగెత్తాను. కొంతమంది నన్ను ఆపి ఇలా అడిగారు :

'నువ్వెందుకు మళ్ళీ వెనక్కు రావడం? లోపలికి రానివ్వలా?'

గేటు ముట్టడించి వున్న సిపాయి ముష్కరులు నన్ను అడ్డగించి నెట్టేశారు. ఎంత బతిమాలుకున్నా ఉపయోగం లేకపోయింది.

కీలుబొమ్మ ప్రభుత్వంపైన అక్కడ ప్రజల కోపాగ్ని అంతులేకుండా పెరిగిపోయింది. చెడతిట్టి పారేశారు.

'అబ్బ! ఎంతటి అడవి మనుషులు! భర్తను ఉరితీయబోయే ముందు కడసారిగా భార్యను

కూడా చూడనివ్వడం లేదు.'

ట్రాయ్ తండ్రి గారు కాంగ్‌నామ్ నుండి వచ్చి ఉన్నాడు. ప్రాణాల మార్పిడి వార్త విని కొడుకు కోసం కొండంత ఆశతో ఎదురు చూస్తున్నాడు. కానీ ఈ దుర్వార్తను ఆశనిపాతం వలె అందరికీ మోసుకెళ్లాను.

మా నాన్న, మామగారు, నేనూ అనుకున్నాం 'మళ్ళీ ఒకసారి వకీలును కలుసుకోవడం తప్ప మరో మార్గం లేద'ని.

నిశ్చింతగా, ధీమాగా ఇలా అన్నాడు వకీలు :

'ఇలా జరగడానికి వీల్లేదు. అతణ్ణి ఉరితీయడం వాయిదా వేస్తూ జారీ చేసిన ఉత్తర్వు నా దగ్గర ఉంది. వాళ్ళు ఆ నిర్ణయాన్ని మార్చుకొన్నట్లయితే ఆ విషయాన్ని తప్పకుండా నాకు తెలియజేయాలి. ఎందుకనంటే నీ భర్తకు నేను డిఫెన్సు లాయరుని. బహుశా ఇంకెవ్వరినైనా ఉరితీసేందుకు సిద్ధమౌతున్నారేమో!

నేనిలా అన్నాను :

'జైలు వెలుపల జనం అంతా చెప్పుకొంటున్నారు – కాంగ్లీ బ్రిడ్జి కింద మందుగని నాటిన అతణ్ణి కాల్చి చంపేందుకు ఆ దుర్మార్గులు సిద్ధమౌతున్నారని, దయచేసి ఆ వివరాలు కాస్త తెలుసుకోండి. మా మనసులు కొంచెం కుదుటపడతాయి.'

వకీలు చాలాసేపు సందేహిస్తూ వుండిపోయాడు. నేను చెప్పిన విషయం వకీలు నమ్మలేదు. చివరకు చీ హువా జైలు ఆఫీసుకు ఫోను చేసి తెలుసుకునేందుకు అంగీకరించాడు.

ఫోన్ రింగ్ చేశాడు. హఠాత్తుగా ఆయన ముఖంలో ఆదోలా మార్పు కనపడింది.

'నిజమేనా? ఆ! అవునా?'

వకీలు ముఖం అమితాశ్చర్యంలో మునిగిపోయింది. ఇంకా ఫోన్‌లో గుసగుసలాడుతున్నాడు. రిసీవరు కింద పెట్టాడు.

ఇలా చెప్పాడు :

'ఇంతకుముందుగానే ట్రాయ్‌ని ఉరి తీశారు. సరిగ్గా పదకొండు గంటలకు, ఇప్పుడు మనం చెయ్యగలిగిందల్లా ఒక్కటే వాళ్ళనడిగి ఆ శవాన్ని తెచ్చుకోవడం.'

నా కాళ్ళు గజగజా వణికిపోయాయి. కుర్చీలో కూలబడి పోయాను. వకీలు బల్ల ముందుకు పడిపోయాను. బిగ్గరగా అరవడానికి, ఏడ్వడానికి నాలో శక్తి లేదు. నా నాన్నగారు వెక్కి వెక్కి ఏడుస్తూ గద్గద గొంతుకతో ఇలా అన్నాడు :

'లేమ్మా! శవాన్ని తెచ్చుకోడానికైనా ప్రయత్నిద్దాం. ఈ పని కోసం కూడా మనం ఇతరుల మీద ఆధారపడకూడదు.'

నేను ఒక టాక్సీని ఏర్పాటు చేయించాను. కోర్టుకూ, భద్రతా శాఖ ఆఫీసులకు ఆ టాక్సీలో వెళ్లాను. నా భర్త శవాన్ని ఎలా తీసుకొని రావాలో అక్కడ విచారించాను.

అక్కడ నా మనవి ఎవరూ పట్టించుకోలేదు. నా ప్రయత్నమంతా వృధా అయిపోయింది. వాళ్ళ చెవులు మూగపడిపోయాయి. నాకు తప్పుడు సమాచారం చెప్పారు.

శ్మశానవాటికకు వెళ్ళి ఒకచోట నుండి మరోచోటకు తిరిగాను. ఒక చోట టాక్సీ డ్రైవర్ ఆశ్చర్యం వెల్లడిస్తూ ఇలా అడిగాడు :

'ఒక సమాధి నుంచి మరో సమాధి వద్దకు ఎందుకలా ప్రాకులాడుతావు?'

'ముష్కరులు నా భర్తను ఉరి తీశారు. ఆయన్ను ఎక్కడ సమాధి చేశారో నాకు తెలియడం లేదు'

'వాళ్ళు నీ భర్తను ఎందుకు చంపారు?'

నేను మౌనం వహించాను. అతడిలా కొనసాగించాడు :

కాంగ్లి బ్రిడ్జి కింద మందుగని నాటినతను కదూ నీ భర్త. ఓరి దేవుడా!'

"పట్టణ మరుభూమిలో ఆయన శవాన్ని పాతిపెట్టారు" ఈ విషయం మరుసటి ఉదయం పత్రికల్లో పడింది. మా కుటుంబం మొత్తంగా అక్కడకు వెళ్లాం. ఒక చిన్న రాయి మీద ఆయన పేరు చెక్కించి తీసుకెళ్ళాం. ఆయన సమాధి ముందు ఆ రాయిని ప్రతిష్ఠించాం.

'అతని పేరు ట్రాయ్ ఎన్‌గుయెన్ వాన్ ట్రాయ్ కదూ!'

నేను ఏమీ మాట్లాడలేకపోయాను. కన్నీళ్ళు నా ముఖాన్ని తడిపేశాయి. దు:ఖాన్ని ఆపుకోడానికి పెదాలను కొరుక్కున్నాను. వాళ్ళు చాలా పాత స్నేహితులైనప్పటికీ నా భర్త పేరు పునశ్చరణ చేసుకుంటున్నాడు ఈ టాక్సీ డ్రైవర్. అతని ముఖం ఎర్రబారింది. కొంచెంసేపు ఆగి అతడు మళ్ళీ ఇలా అడిగాడు :

'అమెరికా రక్షణ మంత్రి మెక్‌సమారాను మట్టుపెట్టేందుకు సాహసించినతడే కదూ నీ భర్త ఎన్‌గుయెన్ వాన్ ట్రాయ్!'

అవునన్నట్లు తలూపాను.

అతడు తన సీటు వెనకాలకెళ్ళి ఒక పత్రిక తీసుకొచ్చి చేతికిచ్చాడు.

'అతని మరణశిక్ష అమలు వాయిదాపడ్డట్లు ఈ పత్రికలన్నీ ప్రకటించాయి. అయినప్పటికీ దుర్మార్గులు అతనిని చంపారు.'

నేను ఆ పత్రికలవైపు చూడలేకపోయాను. దృష్టి అంత హృదయాన్ని లంఘించుకుపోయింది.

డ్రైవరుతో ఇలా అన్నాను.

'దయచేసి మరోచోటికి తీసుకెళ్ళు. అక్కడేమైనా కనపడుతుందేమో.'

డ్రైవరు కారు స్టార్టు చేశాడు. ఆరోజు మధ్యాహ్నం ఎన్ని మైళ్ళు ప్రయాణం చేశామనీ! నాకు చాలా ఆశ్చర్యమేసింది. నా తల తిరిగిపోయింది. బెన్‌థాన్ దగ్గరవున్న బండ్లదొడ్డివద్ద టాక్సీని ఆపాడు. అక్కడతను స్నేహితులందర్నీ సైగచేసి పిలిచి ఈ విషయాన్నంతటినీ చెప్పాడు.

'ఈ ఉదయాన ఎన్ గుయెన్ వాన్ ట్రాయ్‌ని చంపారా'.

ఇతని మాటలు వాళ్ళు నమ్మలేదు.

'ఇది అబద్ధం. అతనికి విధించిన ఉరిశిక్షను అమలు పర్చకుండా వాయిదా వేయమని అమెరికా దౌత్యకార్యాలయం కీలుబొమ్మ ప్రభుత్వానికి ఆజ్ఞ జారీ చేసింది కదా!'

డ్రైవరు నావైపు చూపించాడు.

'ఈమె ట్రాయ్ భార్య. అతని శవం కోసం వెదుకుతోంది'

వాళ్ళందరూ ఏక కంఠంతో ఇలా అడిగారు :

'నిజమేనా! ఉదయాన నిజంగా ట్రాయ్‌ని చంపేశారా వాళ్ళు.

'అ–వు–ను'

వాళ్ళంత దిక్కుతోచని వాళ్ళవలె అలా అయోమయంగా చూస్తుండిపోయారు. గియాదిన్ వైపుగా టాక్సీ కదిలిపోయింది. సాయంత్రం కావస్తున్నా ఆయన్ను ఎక్కడ సమాధి చేసిందీ మేమింకా కనుగొనలేకపోయాం. వీధిలో ఒక మూల కారు ఆపాడు. డ్రైవరు తన సీట్లో కూలబడ్డాడు. అతడు చాలా కోపంగా కనిపిస్తున్నాడు. అతని ముఖం మీద నుంచి చెమట కిందికి జారిపోతుంది. ఆ చెమటలో తన బూడిద రంగు చొక్కా తడిసిపోయింది కారులోంచి బైటకు వచ్చి ఇలా అన్నాడు :

'ఈ సాయంత్రం వెళ్ళి నేను చాలా జాగ్రత్తగా వెదుకుతాను. మళ్ళీ ఏ విషయం నీకు తెలియజేస్తాన్లే.

టాక్సీ అద్దె అతని చేతిలో పెట్టాను. లెక్క పెట్టుకున్నాడు. అందులోంచి సగం తిరిగి నాకు ఇస్తూ ఇలా అన్నాడు :

'భార్యాబిడ్డల కోసం తిండికి తీసుకెళ్లితే చాలు. ఇదిగో ఈ సగం తీసుకో. మళ్లీ రేపు వెళ్లి వెతికేందుకు అద్దె కావద్దూ?.

"పట్టణ మరుభూమిలో ఆయన శవాన్ని పాతిపెట్టారు" ఈ విషయం మరుసటి ఉదయం పత్రికల్లో పడింది. మా కుటుంబం మొత్తంగా అక్కడకు వెళ్లాం. ఒక చిన్న రాయి మీద ఆయన పేరు చెక్కించి తీసుకెళ్ళాం. ఆయన సమాధి ముందు ఆ రాయిని ప్రతిష్ఠించాం. అక్కడ పోలీసులు మా కోసం ఎదురుచూస్తున్నారు. సమాధి చూడ్డానికి వచ్చిన వారిని ఫొటోలు తీసుకొన్నారు.

(మిగతాభాగం వచ్చేవారం)

సినిమా కబుర్లు

దక్షిణాదిలో సినిమాల శ్రీకార గాథ



రంగస్వామి నటరాజ ముదలియార్

అవునన్నా, కాదన్నా సినిమా ఇవాళ జన జీవితంలో ఓ ప్రధానమైన భాగం. ప్రజల కట్టూ బొట్టూ, ఆటా పాటా, మాటా - ఇలా అన్నిటినీ అనూహ్యంగా ప్రభావితం చేస్తున్న శక్తిమంతమైన మాధ్యమం. అలాంటి సినిమాలకు మన దేశంలో నూరేళ్ళకు పైగా చరిత్ర ఉంది. దాదాసాహెబ్ ఫాల్కే తీసిన 'రాజా హరిశ్చంద్ర' (1913)కు మునుపే కొన్ని ప్రయత్నాలు జరిగినప్పటికీ, ఫాల్కే 'రాజా హరిశ్చంద్ర'ను తొలి భారతీయ చలనచిత్రంగా చరిత్రకారులు తీర్మానించారు. మరి, కేవలం మన దక్షిణాది వరకు తీసుకుంటే, ఇక్కడ తొలి చలనచిత్ర ప్రయత్నం ఎవరు, ఎప్పుడు, ఎలా చేశారు?

- రెంటాల జూనియర్

దక్షిణ భారతదేశంలో తొలి పూర్తి నిడివి చలనచిత్రాన్ని రూపొందించిన వ్యక్తి - ఆర్. నటరాజ ముదలియార్‌గా ప్రసిద్ధుడైన రంగస్వామి నటరాజ ముదలియార్ (1885 - 1972). నిజానికి, ఆయన సినిమాలతో అసలు సంబంధమే లేని వ్యక్తి అంటే ఆశ్చర్యం కలుగుతుంది. మద్రాసులోని ప్రసిద్ధ థౌజండ్ లైట్స్ ప్రాంతంలో ఆయన ఆటోమొబైల్ విడిభాగాల డీలర్. వెల్లూరులోని వ్యాపారస్థుల కుటుంబంలో 1885 జనవరి 26న ఆయన జన్మించారు. తండ్రి పేరు - రంగస్వామి. పెద్దమనిషిగా పేరున్న వ్యాపారి. మెట్రిక్ దాకా చదువుకున్న నటరాజ ముదలియార్ తన తండ్రి లాగే వ్యాపార రంగంలోకి దిగారు. రాజధాని అయిన మద్రాసుకు మారి, సమీప బంధువూ, ధనికుడూ అయిన ఎస్.ఎం. ధర్మలింగం ముదలియార్‌తో కలసి 'వాట్సన్ అండ్ కంపెనీ'ని స్థాపించారు. బ్రిటీషు సైకిళ్ళను దిగుమతి చేసుకొని అమ్మేవారు.

మోటారు వ్యాపారం నుంచి మూకీలకు!

అప్పట్లో ఒక్కో సైకిల్ 25 రూపాయలకు అమ్ముడయ్యేది. గ్రామీణ ప్రాంతాల్లో సైకిల్ అంటే ఎంతో వింతగా చూస్తూ, 'రబ్బరు బండి' అని పిలిచేవారట! మొత్తానికి, నటరాజ ముదలియార్ సైకిళ్ళ వ్యాపారం బాగా వృద్ధిలోకి వచ్చింది. అలా అయిదేళ్ళు గడిచాక, 1911లో ఆ వ్యాపార భాగస్వాములు మరో అడుగు ముందుకు వేశారు. అమెరికన్ కార్లు, ఆటోమొబైల్ విడిభాగాల దిగుమతి వ్యాపారం చేసే విదేశీ సంస్థ 'రోమర్, డాన్ అండ్ కంపెనీ' అనే సంస్థను కొన్నారు. మోటారుకార్లను దిగుమతి చేసుకోవడం, అమ్మడం ప్రారంభించారు. అప్పట్లో మద్రాసులో 'అడిసన్ అండ్ కంపెనీ' ఒక్కటే అమెరికన్ కార్ల వ్యాపారం సాగించేదట! దాంతో, అమెరికన్ కార్లను అమ్మిన తొలి భారతీయుడయ్యారు - నటరాజ ముదలియార్. ఆ రోజుల్లో ఒక్కో కారు వెల 1000 రూపాయలే!

అప్పట్లో పాశ్చాత్య దేశాల మూకీ చిత్రాల ప్రదర్శనలను చూశాక, మన దేశంలోనూ చలనచిత్ర నిర్మాణాల తొలినాళ్ళ విశేషాలను తెలుసుకున్నాక నటరాజ ముదలియార్‌కు ఒక ఆలోచన వచ్చింది. మద్రాసులో సైతం ఇలాంటి సైలెంట్ ఫిల్ములు తీసే అవకాశం ఉందని ఆయన గ్రహించారు. చిత్ర నిర్మాణంలోకి దిగాలని నిర్ణయించుకున్నారు. అప్పట్లో లార్డ్ కర్జన్ భారతదేశానికి గవర్నర్ - జనరల్‌గా, వైస్రాయ్‌గా వ్యవహరిస్తుండేవారు. ఆయన నిర్వహించే దర్బార్లనూ, సామాజిక కార్యకలాపాలనూ న్యూస్ రీలుగా బ్రిటీషు సినిమాటోగ్రాఫర్లు చిత్రీకరించేవారు. అలాంటి కెమేరామన్లలో



పమ్మల్ సంబంధ ముదలియార్

ఒకరు - స్టీవర్ట్ స్మిత్. ఆయన పూనాలో ఓ సినిమా హాలు కూడా నడిపేవారు. ఆయనను ముదలియార్ సంప్రదించారు. సినిమాటోగ్రఫీలోని ప్రాథమిక అంశాలు నేర్పాల్సిందిగా అభ్యర్థించి, ఒప్పించారు. పూనాకు వెళ్ళి, స్మిత్‌ను కలుసుకున్నారు. లార్డ్ కర్జన్ 1903 నాటి దర్బార్‌కు అధికారిక సినిమాటోగ్రాఫరైన స్మిత్, మూవీ కెమేరాతో ఎలా చిత్రీకరణ జరపాలో కొద్ది రోజుల పాటు నటరాజ ముదలియార్‌కు నేర్పారు. సినిమా రూపకర్తగా మారాలని ఆశించిన నటరాజ ముదలియార్ అక్కడ కొన్ని దృశ్యాలు చిత్రీకరించారు. పూనాలోని స్మిత్ నివాసంలో ఓ రాత్రి వేళ విందు అనంతరం ఆ దృశ్యాలను ప్రదర్శించి చూశారు.

దక్షిణాదిలో తొలి స్టూడియో

అటుపైన నటరాజ ముదలియార్ మద్రాసుకు తిరిగి వచ్చేశారు. అప్పటికి తెలుగునేలలో అత్యధిక భాగం మద్రాసు రాజధానిగా ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో అంతర్భాగంగా ఉండేది. మద్రాసు వచ్చిన ఆయన, తన వ్యాపార సహచరుడు ధర్మలింగం ముదలియార్‌తో కలసి మిత్రులనూ, వ్యాపార సహచరులనూ వాటాదారులుగా చేర్చుకొని, 1916లో 'ఇండియన్ ఫిల్మ్ కంపెనీ' పేరిట ఓ చలనచిత్ర నిర్మాణ సంస్థను నెలకొల్పారు. అప్పట్లో అందరూ ఇంగ్లీషు తరహా పేర్లు ఎక్కువగా పెడుతుంటే, ఆయన అందుకు భిన్నంగా భారతీయ నామం పెట్టడం గమనార్హం.

అలాగే, దక్షిణ భారతదేశంలోని తొలి స్టూడియోను సైతం మద్రాసులో నటరాజ ముదలియార్ బృందమే నెలకొల్పింది. మద్రాసులోని పరశువాక్కమ్ ప్రాంతంలో మిల్లర్స్ రోడ్డులో నెలకొన్న పెద్ద తోట బంగళా 'టవర్ హౌస్'లో స్టూడియో ఏర్పాటు చేసింది. (ప్రస్తుతం విద్యార్థుల హాస్టళ్ళు, హోటళ్ళు, దుకాణాలు, సినిమా హాళ్ళు, ఆసుపత్రులు, కల్యాణ మండపాలు, వాహనాల రద్దీతో ఎంతో ఇరుకుగా తయారైన ఆ రోడ్డులో 95 ఏళ్ళ క్రితం ఓ స్టూడియో ఉండేదంటే ఇప్పుడు ఆశ్చర్యం కలుగుతుంది). అప్పట్లో తంజావూరు జిల్లాలో ధనిక భూస్వామి కుటుంబానికి చెందిన తిరువయ్యార్ మూపనార్ వద్ద లండన్ నుంచి కొని తెచ్చిన విలియమ్‌సన్ 35 ఎం.ఎం. సైలెంట్ మూవీ కెమేరా, ప్రింటర్ ఉండేవి. ఆయన వద్ద నుంచి వాటిని 1800 రూపాయలకు నటరాజ ముదలియార్ కొన్నారు.

తొలి మూకీకి తంటాలు

అయితే, ఫిల్మును కడిగి, నిర్మాణానంతర కార్యకలాపాలు జరిపే లేబొరేటరీని మాత్రం వాతావరణం చల్లగా ఉండి, అలాంటి పనులకు అనుకూలించే బెంగుళూరులో నెలకొల్పారు. ఫిల్ముల ప్రాసెసింగ్ పనిలో శిక్షణ పొందిన నారాయణస్వామిని ఆ లేబొరేటరీకి పెద్దగా నియమించారు. అప్పట్లో చిత్రీకరణ జరపగానే, చిత్రీకరణ ముగిసిన ఫిల్ము రోల్స్‌ను ఏ రోజుకు ఆ

రోజు శరవేగంగా బెంగుళూరుకు పంపేసేవారు. ఎక్స్‌పోజ్ అయి, అలా వచ్చిన రీళ్ళను బెంగుళూరులో ప్రాసెసింగ్ చేసేవారు. నటరాజ ముదలియార్ వారానికి ఒకసారి బెంగుళూరుకు వెళ్ళి, పురోగతిని కనుక్కునేవారు.

ఆనాటి తమిళ నాటక రంగ పునరుజ్జీవనంలో ముఖ్యుడైన తన మిత్రుడు పమ్మల్ సంబంధ ముదలియార్‌ను ఏ కథ తెరకెక్కించాలనే విషయంలో సలహా అడిగారు. భావోద్వేగాలు, పోరాటం, కొద్దిపాటి సెక్స్ అప్పీలు కూడా ఉన్న కథనే తెరకెక్కించాల్సిందని చెప్పి, ఆ మూడూ ఉన్న ద్రౌపదీ, కీచక వృత్తాంతాన్ని సినిమాగా తీయాల్సిందిగా ఆయన సలహా ఇచ్చారు. తొలి ప్రయత్నంలో అలాంటి కథను సినిమాగా తీయడం సరైనది కాదని కొందరు బంధువులు అభ్యంతరం చెప్పినప్పటికీ, నటరాజ ముదలియార్ పట్టుదలతో ముందుకు సాగి, 'కీచక వధమ్' ప్రారంభించారు. కానీ, ఆయన ప్రాథమికంగా రచయిత కాదు. దాంతో, తన సన్నిహిత మిత్రుడూ – రంగస్థల ప్రముఖుడూ అయిన సి. రంగవడివేలు అనే వకీలును ఆశ్రయించారు. సినిమాలో పాత్రలు పోషించే నటీనటులకు శిక్షణనిచ్చే బాధ్యతను కూడా నిర్వహించారు. అలా దక్షిణ భారతదేశంలో కెల్లా తొలి చలనచిత్రం 'కీచక వధమ్' (1916) తయారైంది.

రఘుపతి ప్రకాశ్

గాంధీ కుమారుడితో టైటిల్ కార్డుల రచన

మహాభారతంలోని కథ ఆధారంగా రూపొందిన ఈ చిత్రం 35 రోజుల్లో పూర్తయింది. అప్పట్లో సినిమా షూటింగ్ చేయడానికి విద్యుత్ దీపాలు కూడా అందుబాటులో లేవు. అందుకే, బంగళాలో ఓ పందిరి లాంటిది వేయించి, దానికి పై కప్పు వేయకుండా తెల్లటి వస్త్రాన్ని కట్టారట! ఆ వస్త్రం గుండా వచ్చిన సూర్యరశ్మి కాంతిలో చిత్రీకరణ జరిపేవారట! రంగస్థల నటీనటులైన రాజా ముదలియార్‌తో కీచక పాత్ర, జీవరత్నంతో ద్రౌపది పాత్ర వేయించారు. అప్పట్లో ఈ సినిమా తీయడానికి రూ. 35 వేల దాకా ఖర్చయిందట! ఆ రోజుల్లో ఓ సినిమాకు అంత డబ్బు ఖర్చు కావడమంటే చాలా ఎక్కువ. చిత్ర నిర్మాణంలో నటరాజ ముదలియార్‌కు అప్పటికి పెద్దగా అనుభవం లేదనడానికి అంత ఖర్చు కావడమే సాక్ష్యం.

1917లో చిత్రీకరణ జరుపుకొన్న ఈ మూకీ చిత్రం 1918 జనవరిలో మద్రాసులోని 'ఎల్ఫిన్‌స్టన్ సినిమా' హాలు (మౌంట్‌రోడ్‌లోని ఇప్పటి కొత్త శాసనసభ ప్రాంగణం ఎదురుగా ఉండేది)లో విడుదలైనట్లూ, రెండు వారాల పాటు ఆడినట్లూ చరిత్రకారులు చెబుతున్నారు. ఆ చిత్రం కరాచీతో సహా భారతదేశ వ్యాప్తంగానే కాక, రంగూన్ (బర్మా), సిలోన్, ఫెడరేటెడ్ మాలే స్టేట్స్‌లో, సింగపూర్‌లో, ఇతర ఇరుగు పొరుగు దేశాల్లో సైతం విజయవంతంగా ఆడింది. అప్పట్లోనే ఆ సినిమా మొత్తం రూ. 50 వేల దాకా వసూళ్ళు చేసిందట! అంటే, రూ. 15 వేలు లాభమన్నమాట. ఆ రోజుల్లో అది చాలా పెద్ద మొత్తం కిందే లెక్క.

అప్పట్లో సినిమా మొత్తం శబ్దరహితంగా సాగేది కాబట్టి, మాటలు, పాటలు లేని ఆ మూకీ చిత్రాల్లో తెరపై జరుగుతున్నదేమిటో ప్రేక్షకులకు అర్థమయ్యేలా చెప్పాల్సిన అవసరం ఉండేది. దాంతో, దృశ్యానికీ దృశ్యానికీ మధ్య 'ఇంటర్ – టైటిల్ కార్డుల'లో కథా సందర్భాన్నీ, సన్నివేశాన్నీ, కొన్ని ముఖ్యమైన సంభాషణలనూ తెరపై చూపేవారు. నటరాజ ముదలియార్ చిత్రాల్లోని టైటిల్ కార్డులు తమిళం, హిందీ, ఇంగ్లీషు భాషల్లో ఉండేవి. దాంతో, ఈ మూకీ చిత్రాలను ఏ ప్రాంతంలోని, ఏ భాష ప్రజలు చూసినా కథ సులువుగా అర్థమయ్యేది.

మహాత్మా గాంధీ కుమారుడూ, తరువాతి రోజుల్లో ప్రసిద్ధ పాత్రికేయుడూ, వార్తాపత్రిక ఎడిటరూ అయిన దేవ్‌దాస్ గాంధీ ఈ చిత్రానికి హిందీ టైటిల్స్ రాశారు. ఇక, మద్రాసు నగర వైద్య ప్రముఖుల్లో ఒకరూ – నటరాజ ముదలియార్‌కు సమీప బంధువూ అయిన డాక్టర్ ఎం.ఆర్. గురుస్వామి ముదలియార్ తమిళంలో టైటిల్ కార్డులు రచించారు. ఇక, ఎడిటర్, సినిమాటోగ్రాఫర్, నిర్మాత, దర్శకుడు, స్టూడియో వ్యవహారాల పర్యవేక్షకుడు – అన్నీ నటరాజ ముదలియారే! కలకత్తాకు చెందిన మదన్, బొంబాయికి చెందిన అర్దేషిర్ ఇరానీలు ఆ రోజుల్లో భారతదేశమంతటా నటరాజ ముదలియార్ చిత్రాలను పంపిణీ చేసేవారు. అలా 'కీచక వధమ్'లో ఏ భాష మాటలూ వినిపించకపోయినప్పటికీ, దీనితో సంబంధం ఉన్నవాళ్ళందరూ ఎక్కువగా తమిళులే కావడంతో, చాలామంది దీన్ని తొలి తమిళ చిత్రంగా పేర్కొంటూ ఉంటారు. కానీ, నిర్దుష్టంగా చెప్పాలంటే – ఇది దక్షిణ భారతదేశంలో తయారైన తొలి పూర్తి నిడివి చలనచిత్రం!

ఆడవారి కోసం అష్టకష్టాలు

నటరాజ ముదలియార్ నేతృత్వంలోని 'ఇండియన్ ఫిల్మ్ కంపెనీ' ఆ తరువాత తమ రెండో చిత్రం 'ద్రౌపదీ వస్త్రాపహరణం' నిర్మించింది. 1917లో ఆ చిత్రం విడుదలైంది. సినిమాల్లో నటించడానికి ఆడవాళ్ళు అప్పట్లో ముందుకు వచ్చేవారు కాదు, అందులోనూ కులస్త్రీలు అసలు వచ్చేవారు కాదు. నటరాజ ముదలియార్‌కు సైతం ఈ ఇబ్బంది తప్పలేదు. అయితే, ఎలాగోలా ప్రాధేయపడి, పాశ్చాత్య మహిళలనూ, ఆ తరువాత కొంతమంది ఆంగ్లో – ఇండియన్ స్త్రీలనూ నటనకు ఒప్పించారు. ఆ సమస్యను ఆయన అలా పరిష్కరించారు. వయొలెట్ బెర్రీ అనే మహిళ ఆయన నిర్మించిన చిత్రాల్లో నటించారు.

ఆమే కాకుండా విలోచన (మేరియన్ హిల్), రాజా ముదలియార్, జీవరత్నం, దొరైస్వామి పిళ్ళైలు కూడా 'ద్రౌపదీ వస్త్రాపహరణం'లో నటించారు. భారతీయ వనితలెవరూ పోషించడానికి ఇష్టపడని ద్రౌపది పాత్రను పాశ్చాత్య వనిత వయొలెట్ బెర్రీ ధరించగా, దుశ్శాసనుడి పాత్రను ఆంగ్లం తెలిసిన దొరైస్వామి పిళ్ళై పోషించినట్లు చెబుతారు. బ్రిటీషు వారు మన భారతీయులను బానిసలుగా చూస్తున్న ఆ రోజుల్లో బ్రిటీషు వనితతో ద్రౌపది వేషం వేయించి, ఆమె చీర ఊడదీయించిన ధీశాలి నటరాజ ముదలియార్. మొదటి సినిమా కన్నా తక్కువ ఖర్చుతో రూపొందిన ఈ చిత్రం, దాని కన్నా ఎక్కువ వసూళ్ళు (రూ. 75 వేలు) సాధించిందట!

తరువాతి కాలంలో నటరాజ ముదలియార్ స్వతంత్రంగా చిత్ర నిర్మాణాన్ని చేపట్టడం కోసం ఆ సంస్థను విడిచిపెట్టి వెళ్ళారు. స్వస్థలమైన వేలూరుకు వెళ్ళి, ఒంటి చేత్తో 1919లో 'మహిరావణన్', 'మార్కండేయ' అనే రెండు చిత్రాలు నిర్మించారు. ఆ రెండు చిత్రాలనూ వెల్లూరు పరిసరాల్లోని కొండ ప్రాంతాల్లో చిత్రీకరించారు. 'మార్కండేయ'లో యముడిగా నటించిన సుబ్రహ్మణ్య నాయుడుతోనే 'మహిరావణన్' కూడా తీసినట్లు కథనం. నటరాజ ముదలియార్ నిర్మించిన ఈ చిత్రాలన్నీ ఒక్కొక్కటీ సుమారు 6 వేల అడుగుల నిడివి ఉండేవి. అలాగే, ఆయనే తీసిన 'లవ కుశ'లో శ్రీరాముడిగా గోవిందస్వామి నాయుడు నటించారట! మరో చిత్రం 'రుక్మిణి – సత్యభామ'లో రుక్మిణిగా బ్రాహ్మణ యువతి జానకి నటించడం ఆ రోజుల్లో విశేషం. సత్యభామగా జీవరత్నం, శ్రీకృష్ణుడిగా నటేశ నాయుడు నటించారట!

తెరకు దూరమైన తొలి చిత్ర రూపకర్త

అయితే, ఆ తరువాత అంటే... 1923లో జరిగిన ఓ అగ్నిప్రమాదంలో నటరాజ ముదలియార్ స్టూడియో కాలిపోయింది. దెబ్బ మీద దెబ్బగా కుమారుడు కూడా చనిపోవడంతో, ఆయన విషాదంలో మునిగిపోయారు. చలనచిత్ర నిర్మాణాన్ని మానేసి, మళ్ళీ ఆటోమొబైల్ విడిభాగాల విక్రయ వ్యాపారంలోకి వెళ్ళిపోయారు. అలా ఆ తరువాతి కాలంలో సినిమాల నిర్మాణానికి దూరంగా మెలగి, ప్రజల స్మృతిపథంలో నుంచి పక్కకు తొలగిన నటరాజ ముదలియార్ చివరకు 1972 మే 3న మద్రాసులో కన్నుమూశారు.

మద్రాసు ఇవాళ దక్షిణ భారతదేశమంతటికీ అతి పెద్ద చిత్ర నిర్మాణ కేంద్రంగా ఎదిగింది. కానీ, ఒక్కసారి చరిత్రను గమనిస్తే – మద్రాసులో సినిమాలంటూ తీయడం మొదలైన తొలి పదేళ్ళ కాలంలో ఇద్దరే ఇద్దరు భారతీయులు చలనచిత్రాలు నిర్మించారు. వారిలో ఒకరు నటరాజ ముదలియార్. రెండో వ్యక్తి – తెలుగు చలనచిత్ర పితామహుడైన రఘుపతి వెంకయ్య కుమారుడు ఆర్. ప్రకాశ్. (వీళ్ళిద్దరూ కాక సినిమాలు తీసింది – వైటకెర్ అనే ఓ పాశ్చాత్యుడు మాత్రమే!). దక్షిణాదిలో చలనచిత్ర నిర్మాణానికి బీజం వేసిన నటరాజ ముదలియార్ కృషి, ఆయన రూపొందించిన తొలి దక్షిణాది చలనచిత్రం 'కీచక వధమ్' ఇప్పటికీ, ఎప్పటికీ స్మరణీయమే! ★

చూద్దామా



అతి సుందర నగరం
కోపెన్ హాగెన్

వందలాది ద్వీప సముదాయం మధ్య వెలసిన సుందర నగరమిది. పాలు, పన్నీరు, వెన్న, సముద్ర ఉత్పత్తులకు పేరుగాంచిన నగరమిది. ప్రముఖ ఓడరేవు పట్టణంగా గుర్తింపు పొందింది. అటు ఆధునిక ... ఇటు చారిత్రక సాంప్రదాయాల మేలు కలయికకు పెట్టింది పేరు. ప్రతి సంవత్సరం కొంగొత్త ప్రాంతాలను తప్పక వీక్షించే పర్యాటకుల పాలిట వర ప్రసాదం. అదే కోపెన్‌హాగెన్. మరి ఉల్లాసాన్ని... ఉత్సాహాన్ని... ఆహ్లాదాన్ని అందించే ఆ నగర విశేషాలేంటో చూద్దామా...

ప్రపంచంలోకెల్లా ఆధునిక సౌకర్యాలు ఉన్న నగరం ఏదంటే తడుముకోకుండా చెప్పేది ఒక్కటే పేరు. ఇక్కడ ఆధునికతే కాదు సంప్రదాయాలకూ కొదవలేదు. అదే కోపెన్ హాగెన్. విలాసవంతమైన రెస్టారెంట్లు, నివాస గృహాలు... అంతేకాదు ఇక్కడి ప్రజలకి కాలుష్యమంటే ఏంటో కూడా తెలీదు. ప్రశాంత వాతావరణం, చుట్టూ పచ్చిక బయళ్ళు, చల్లటి పిల్లగాలికి అలా... నడుస్తూ వెళ్తుంటే ఎంత బావుంటుందో ఒక్కసారి ఊహించుకోండి. అబ్బ వెంటనే అక్కడికి వెళ్లి విహరించాలనిపిస్తుంది కదా... అలాంటి వాతావరణంలో ఉంటే అనారోగ్యాలు, బాధలు దరిచేరవేమో అనిపిస్తుంది. అంత చక్కటి... చల్లటి... వాతావరణం కోపెన్ హాగెన్ నగరం సొంతం.



జలకన్య

కోపెన్ హాగెన్ నగరం ఉత్తర యూరప్‌లోని బాల్టిక్ సముద్రం మధ్య ఉంది. ఇది డెన్మార్క్ రాజధానిగా వుంది. ఈ నగరాన్ని 11వ శతాబ్దంలో బిషప్ ఓప్‌లర్ నిర్మించారు. ఇతని స్మారక చిహ్నం ఇప్పటికీ మనం చూడొచ్చు. ఈ నగరం పాల ఉత్పత్తులకు, సముద్ర ఉత్పత్తులకు ప్రసిద్ధి.

నేషనల్ గ్యాలరీ

పర్యాటకులను ఆకర్షించే వాటిలో ముఖ్యంగా చెప్పుకోదగినది నేషనల్ గ్యాలరీ. దీన్ని బైజెంటాయిన్ వాస్తుశైలిలో నిర్మించారు. ప్రాచీన డానిష్ చరిత్రను తెలిపే చిత్రాలెన్నింటినో ఇక్కడ చిత్రించారు. ఇంకా ప్రాచీన సంస్కృతికి సంబంధించిన ఆనాటి వస్తువులు, కళాకృతులను ఇక్కడ చూడొచ్చు. 1807 వ సంవత్సరంలో ప్రారంభించిన స్టేట్ మ్యూజియంలో పిల్లల కోసం ఒక ప్రత్యేక విభాగం ఉంది. అందులోని మధ్యయుగం నాటి కోటలో నడయాడడం, పురాతన వైకింగ్ షిప్‌లో విహరించడం, 19 శతాబ్దపు చివరి కాలంలోని తరగతి గదుల్లో కూర్చుని చదువుకోవడం... వంటివి పిల్లలు ఎంతగానో ఇష్టపడతారు. ఇక్కడి వస్తువులన్నీ పిల్లల్ని ఆ రోజుల్లోకి తీసుకెళ్తాయి.

టివోలీ గార్డెన్

ఎంతో విశాలమైన పార్క్ ఇక్కడుంది. దీనికి ప్రపంచంలోనే ఆహ్లాదకరమైనదిగా గొప్ప పేరుంది. దీన్ని 18 వ శతాబ్దంలో ఏర్పాటు చేశారు. తాత్కాలిక రాజు కార్స్‌పెన్షన్ 17 ఎకరాల భూమిని ఈ పార్కు కోసం కేటాయించాడు. దీన్ని చిన్న పిల్లలకే కాదు అన్ని వయసుల వారికీ నచ్చే విధంగా ఏర్పాటు చేశారు. మోటర్‌తో ఏర్పాటు చేసిన రైలు పిల్లలకు ప్రత్యేకాకర్షణ. రాత్రి సమయంలో రంగు రంగుల విద్యుత్ దీపాల మధ్య దేదీప్యమానంగా వెలుగులు విరజిమ్ముతున్నప్పుడు ఈ పార్కును చూడడానికి రెండు కళ్లూ చాలవేమో అనిపిస్తుంది. ఇక్కడుంటే ఆకలి దప్పికలు తప్ప వేరేది గుర్తుకు రాదు. అంతగా ప్రకృతిలో లీనమైపోతాం. ఇక్కడ గడిపిన ప్రతిక్షణం జీవితాంతం



గుర్తుండిపోతుంది.

స్ట్రోగేట్ షాపింగ్

నగరంలోని స్ట్రోగేట్ బజార్‌లో పర్యాటకులు షాపింగ్ చేయడానికి ఆసక్తి చూపుతారు. ఇక్కడి రోడ్లన్నీ చాలా పొడవుగా వుంటాయి. ఇందులోని ఒక రోడ్డు టౌన్‌హాల్ నుండి మ్యూజియం వరకు ఉంటుంది. దారి పక్కనే పాదచారులకు తినడానికి రెస్టారెంట్లు కూడా వున్నాయి. ఇక్కడ లభించని వస్తువంటూ ఉండదు. గుండు సూది మొదలు అన్ని రకాల వస్తువులూ దొరుకుతాయి. దుకాణాల ముందు రకరకాల డిస్‌ప్లే బోర్డులు కనిపిస్తాయి. క్రిస్మస్ పండుగ సమయంలో దుకాణాలను ప్రత్యేకంగా అలంకరిస్తారు. రాత్రిపూట విద్యుత్ దీపాలను చూసిన పర్యాటకులు మైమరిచిపోతారు.

ఆకర్షించే జలకన్య

కోపెన్ హాగెన్‌లో ఉన్న జలకన్య విగ్రహం చూడ్డానికి చిన్నగా ఉన్నా చూపరులను విశేషంగా ఆకట్టుకుంటుంది. ఈ విగ్రహం విచార వదనంలో ఉంటుంది. దీన్ని సముద్రం ఒడ్డున ఎత్తైన రాతిమీద ఏర్పాటు చేశారు. ఈ శిల్పం చెక్కడం వెనుక ఓ కథ ఉందని స్థానికులు చెబుతారు. 1909లో కార్ల్స్‌బర్గ్ బియర్ కంపెనీ యజమాని కుమారుడు కార్ల్ జేకబ్సన్ కోరిక మేరకు జలకన్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలన్న నిర్ణయానికొచ్చారు. ఇది ప్రసిద్ధ శిల్పి ఎడ్వర్డ్ ఎరిక్సన్ ప్రతిభకు చిహ్నంగా నిలుస్తుంది. ఎరిక్సన్ తన భార్యనే మోడల్‌గా పెట్టి ఈ శిల్పాన్ని చెక్కాడు. అయితే 1913లో అసంపూర్తిగానే ఈ విగ్రహాన్ని ఆపేశారు. ఎన్నోసార్లు దీన్ని పునర్నిర్మాణం తలపెట్టినా ఎప్పటికో గాని అది సఫలం కాలేదు. యూరోపియన్ యూనియన్‌లో టర్కీ దేశస్థుల విలీన సమయంలో జరిగిన తిరుగుబాటు దాడిలో ఈ విగ్రహం దెబ్బతిన్నది. దాంతో దీనికి బురఖా తొడిగారు.

ఆర్హస్ ... ఓడెన్స్...

ఇక్కడ చూడాల్సిన మరో రెండు ముఖ్య పట్టణాలు ఆర్హస్, ఓడెన్స్. డెన్మార్క్‌లో పెద్ద పట్టణాల్లో ఆర్హస్ ఒకటి. ఇక్కడ లడాకూ వైకింగ్ జాతీయులు నివసిస్తారు. వెయ్యి సంవత్సరాల క్రితం వీరు ఈ నగరానికి మూల స్తంభాల్లా వుండేవారు. ప్రస్తుతం వీరు తమ పూర్వీకులతో పోలిస్తే చాలా ఆధునికంగా, అందంగా కనిపిస్తారు. ఎంతో గౌరవ మర్యాదలతో పర్యాటకులకు తమ సహాయ సహకారాల్ని అందిస్తారు. అంతే కాకుండా ప్రస్తుతం ఎన్నో విద్యాలయాలతో ఈ నగరం వెలుగొందుతోంది. డెన్మార్క్ సాంస్కృతిక జీవనంలో ఈ నగరం ప్రముఖ పాత్ర పోషిస్తోంది.

సిటీహాల్

1940లో నిర్మించిన సిటీ హాల్ ముఖ్యమైన పర్యాటక స్థలంగా ఉంది. ఈ టవర్ పైకి వెళ్లడానికి 450 మెట్లు ఎక్కాల్సుంటుంది. దీని పైకెక్కి చూస్తే నగరమంతా కనిపిస్తుంది. ఇక్కడి మ్యూజియం ప్రపంచంలోకెల్లా ప్రసిద్ధి పొందింది. దీనిని దర్శిస్తే అక్కడి ప్రాచీనుల జీవన శైలి, ఆచార వ్యవహారాలు అర్థమౌతాయి. పూర్వకాలంలో మహిళల వస్త్రధారణ, వారి వంట విధానం, ఇంటిపనులు చేసే పద్ధతి, ఇంటిని శుభ్రపరచుకొనే విధానం ఆశ్చర్యపరుస్తుంది.



ఓడెన్స్ నగరం

జనాభా దృష్ట్యా డెన్మార్క్‌లో మూడోస్థానంలో ఓడెన్స్ పట్టణం ఉంది. ఈ నగరం మొత్తం హెన్స్ క్రిస్టియన్ ఆండర్సన్ రాజు పర్యవేక్షణలోనే నిర్మితమైంది. నగరంలో ప్రతిచోటా అతని చిత్రాలు కనిపిస్తాయి. ఇతని జీవిత కాలం మొత్తం ఈ నగరంలోనే గడిచిందనడానికి చారిత్రక ఆధారాలు ఉన్నాయి. ఈయన జీవితం మొత్తం దారిద్ర్యంలోనే గడిచింది. అది ఎలా ఉందంటే పేరుకు రాజు కానీ జీవితాంతం పూరి గుడిసెలోనే గడిపాడు. ఇప్పుడు ఆ ఇంటినే 'ఆండర్సన్ మ్యూజియం'గా మార్చారు. ఈయన చరిత్రను పిల్లలు ఇష్టంగా చదువుతారు. కొద్ది సంవత్సరాల క్రితమే మొదటి హెన్స్ క్రిస్టియన్ ఆండర్సన్ ద్విశతాబ్ది పుట్టినరోజు ఉత్సవాలు ఎంతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన అభిమానులు కొందరు 'అంత గొప్ప వ్యక్తి పేరును వ్యాపారం కోసం వాడుకుంటున్నారు' అని తమ నిరసనను తెలియజేశారు.

ఆండర్సన్ మ్యూజియం

మంక్‌మోస్ట్రెడ్ రహదారిలో ఉన్న చిన్న గుడిసెలో హెన్స్ జన్మించాడు. అతని బాల్యమంతా ఆ ఇంట్లోనే గడిచింది. ప్రస్తుతం ఆ ఇంటిని ఆండర్సన్ మ్యూజియంగా మార్చేశారు. ఆయన తన ఆత్మకథలో రాసుకున్న వివరాల ప్రకారం వస్తుసముదాయాన్ని సేకరించి ఇక్కడ భద్రపరిచారు. ఆండర్సన్ పేపర్ కటింగ్ కళలో నిపుణుడని చాలా కొద్దిమందికే తెలుసు.

ఎప్పుడైతే బావుంటుంది?

డెన్మార్క్‌లో జూన్, జులై మాసాల్లో కనిష్ట ఉష్ణోగ్రత 10-11 డిగ్రీల సెల్సియస్, గరిష్ట ఉష్ణోగ్రత 18-21 డిగ్రీల సెల్సియస్ వుంటుంది. మిగిలిన నెలల్లో ఇక్కడి వాతావరణం చాలా చల్లగా వుంటుంది. అప్పుడు హాయిగా...కోపెన్‌హాగెన్ చెక్కేయొచ్చన్నమాట. ★



సిటీహాల్



ఉచిత విజ్ఞాన సర్వస్వం
వికీపీడియాకు పదేళ్లు

ఇంటర్నెట్‌తో పరిచయం ఉన్నవారికి వికీపీడియా పేరు సుపరిచితమే. ఏ అంశానికి సంబంధించిన సమాచారమైనా క్షణంలో మన కళ్ల ముందుంచే ఏకైక సాధనం వికీపీడియా. ఇది పరిచయమై పదేళ్లవుతోంది. చిన్నప్పుడు అందరం వామన గుంటలు, కోతి కొమ్మచ్చి వంటి ఆటలు ఆడుకొని వుంటాం... లేదా మన గ్రామానికో, పట్టణానికో వున్న ఏదో ఒక చరిత్ర మనకు తెలిసే వుంటుంది. ఇలాంటివి ఏవైనా కావచ్చు... ఇవన్నీ మన తరానికే పరిమితమా? మన తర్వాతి తరాలకు వీటిని అందించాల్సిన అవసరం లేదా? మన పిల్లలకు, వాళ్ల పిల్లలకు వాటి గురించి చెప్పాలంటే ఎలా? పూర్వ కాలంలో విజ్ఞాన సమపార్జనకు గురుకులాల్లో గురువు చెప్పింది విని అనేక విషయాలు తెలుసుకునేవారు. తరువాతి కాలంలో చేతిరాతతో రాసిన గ్రంథాలను పఠించి విజ్ఞానం పొందేవారు. అనంతర కాలంలో ప్రింటింగ్ ప్రెస్‌ల ఆవిర్భావంతో విజ్ఞానం మరింత విస్తృతమైంది. ప్రస్తుతం మనమున్నది ఇంటర్నెట్ యుగంలో. ఒక పుస్తకం పట్టుకోకుండానే దానికి సంబంధించిన విజ్ఞానం మన కళ్ల ముందు ప్రత్యక్షమవుతోంది. వాటి గురించి రాసి పెట్టబట్టే ఆ విజ్ఞాన భాండాగారాన్ని మన స్వంతం చేసుకోగలుగుతున్నాం. అదేవిధంగా రాబోయే తరాలూ వాటి గురించి తెలుసుకోగలుగుతారు. ఇదే తరహాలో తరతరాలు విజ్ఞానాన్ని పంచేందుకు ప్రపంచంలోని ప్రతీ విషయం గురించీ ఒక చోట రాస్తే.... అదే విజ్ఞాన సర్వస్వం... వికీపీడియా!!

- కె.ఎక్స్.రాజు

వికీపీడియా - ఎన్‌సైక్లోపీడియా పేరును అనుసరిస్తూ పెట్టిన పేరిది. జిమ్మీ వేల్స్ అనే అమెరికన్‌కు వచ్చిందీ 'ఉచిత విజ్ఞాన సర్వస్వం' ఆలోచన. ఇంగ్లీషులో ఫ్రీకి ఉచితం, స్వేచ్ఛ అని రెండర్థాలు. ఈ రెండర్థాలు వికీపీడియాకు వర్తిస్తాయి. ఇందులో ఎవరైనా రాయవచ్చు, దిద్దుబాట్లు చెయ్యవచ్చు. చదువుకునేందుకు ఇంటర్నెట్లో అందరికీ ఉచితంగా అందుబాటులో ఉండేదే స్వేచ్ఛా విజ్ఞాన సర్వస్వం. జిమ్మీ వేల్స్ ఆలోచనల ప్రతిరూపమే వికీపీడియా. అయితే ఈ పేరును సూచించింది మాత్రం లారీ సాంగర్. 2001, జనవరి 15న జిమ్మీ వేల్స్, లారీ సాంగర్ వికీపీడియాను నెలకొల్పారు. అప్పటికే జిమ్మీవేల్స్ తాను రూపొందిస్తున్న 'నుపీడియా' అనే విజ్ఞాన సర్వస్వాన్ని వికీపీడియాగా పేరు మార్చి మొదటగా ఇంగ్లీషు భాషలో మొదలుపెట్టాడు. వికీపీడియా చాలా త్వరగా ప్రజల మన్ననలను పొందింది. 'ఇంతింతై వటుడింతై...' అన్నట్టుగా పెరిగి విశ్వవ్యాప్తమైంది. గొప్ప గొప్ప వ్యాసాలెన్నో తయారయ్యాయి, అవుతూ వున్నాయి. ఇంటర్నెట్లో వివిధ భాషలకు ప్రత్యేకించిన వెబ్‌సైట్లలో ఈ విజ్ఞాన సర్వస్వాన్ని రాస్తున్నారు.

ప్రస్తుతం వికీపీడియాలో 36 కోట్లకు పైగా పాఠకులు వున్నారు. ప్రతిఫలాన్ని ఆశించకుండా గత పదేళ్లుగా విజ్ఞాన సర్వస్వాన్ని ప్రపంచవ్యాప్తంగా అందిస్తోంది. ఈ పదేళ్ల ప్రస్థానంలో ఎన్నో మైలురాళ్లను అధిగమించిన వికీపీడియా త్వరలో వాషింగ్టన్ పోస్ట్‌తో టై అప్ కానుంది. పుట్టిననాటి నుంచి నేటివరకు దినదినాభివృద్ధి చెందుతూ నెట్ ప్రపంచంలో అతి పెద్ద వెబ్‌సైట్‌గా గుర్తింపు పొందింది. కోటీ డెబ్బయ్ లక్షల వ్యాసాలతో ఎన్‌సైక్లోపీడియాను రూపొందించింది వికీపీడియా. 261 భాషల్లో వ్యాసాలను నెటిజన్లకు అందుబాటులో వుంచింది. ఒక్క ఇంగ్లీషులోనే 13,788,716 మంది రిజిస్టర్డ్ సభ్యులుండగా, 3,534,110 వ్యాసాలు అందుబాటులో వున్నాయి. ఆంగ్లభాష తర్వాత జర్మన్ వికీపీడియాలో అత్యధిక వ్యాసాలున్నాయి. ఇంగ్లీష్, జర్మన్, జపనీస్, స్పానిష్, ఫ్రెంచి, ఇటాలియన్, రష్యన్, చైనీస్... ఇలా ప్రపంచవ్యాప్తంగా అనేక ఇతర భాషల్లోనూ వికీపీడియాలు మొదలయ్యాయి. విశ్వవ్యాప్తంగా వున్న అన్ని భాషల్లోనూ వికీపీడియాను తీసుకురావాలని లారీ సాంగర్ ఆకాంక్షిస్తున్నారు. దీని తొలి అంతర్జాతీయ

కార్యాలయాన్ని భారత్‌లోని ఒక ముఖ్య నగరంలో ఏర్పాటు చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి.

వికీపీడియా విశిష్టత...

వికీపీడియా అంటే ఎవరైనా దిద్దుబాటు చెయ్యగల ఎన్‌సైక్లోపీడియా. ఎవరైనా రాయదగిన ఒక ఉచిత విజ్ఞాన సర్వస్వం. వికీపీడియా విజయ రహస్యమంతా ఈ వికీ అనే మాటలోనే ఉంది. వికీపీడియాలో రాసేది ఎవరో ప్రముఖ విద్యావంతులో, ప్రత్యేకంగా అందుకోసం నియమితులైన రచయితలో కాదు. మనలాంటి వారే. వికీపీడియాలో ఎవరైనా, ఏ విషయం గురించైనా రాయవచ్చు. దీని ప్రధాన లక్ష్యం స్వచ్ఛందంగా ఎవరికి వారు తమకు తెలిసిన సమాచారాన్ని ఒక చోట చేర్చగలగటం, మార్చగలగటం. ఇక్కడ సమాచారాన్ని చూడటమే కాదు, ఉన్న సమాచారంలో అవసరమైన మార్పులు చేర్పులు చెయ్యవచ్చు. ఇక్కడ లేని సమాచారాన్ని చేర్చవచ్చు. ఇది అనేక మంది రచయితల సమిష్టి కృషి ఫలితం. ఇక్కడ పాఠకులే రచయితలు. ఎవరైనా రచయితలు కావచ్చు. ఈ సైటు ముఖ్య ఉద్దేశ్యం కూడా సభ్యులందరి కృషితో వ్యాసాలను అభివృద్ధి చేయడమే! అనేకమంది ఔత్సాహికులు ప్రతిరోజూ వందల కొద్దీ మార్పులు చేర్పులు చేస్తూ, నిరంతరం మెరుగులు దిద్దుతుంటారు. వ్యాసాలను సరిదిద్దే విషయమై చొరవగా ముందుకు రమ్మని వికీపీడియా సభ్యులందరినీ ప్రోత్సహిస్తోంది. సరైన పద్ధతిలో రాయని మంచి వ్యాసం గానీ, మరీ పసలేని వ్యాసం గానీ, చిన్న చిన్న పొరపాట్లు గానీ, తప్పుల తడక గానీ, హాస్యాస్పదమైనది గానీ ఏదైనా వికీపీడియాలో కనిపిస్తే తప్పులు సరిదిద్దవచ్చు. మీరు చేసే దిద్దుబాట్ల వల్ల నష్టం వాటిల్లుతుందని భయపడనక్కర్లేదు. ఎప్పుడైనా వాటిని సరిదిద్దవచ్చు లేదా మెరుగుపరచవచ్చు. వ్యాసాల్లోని తప్పులను, వ్యాకరణ దోషాలను సవరిస్తూ, కొత్త విషయాలను జోడిస్తూ, భాషను మెరుగుపరుస్తుండడం వల్లనే వికీ చురుగ్గా వృద్ధి చెందుతోంది. ఈ దిద్దుబాట్లు అన్నీ 'పేజీ చరిత్ర', 'ఇటీవలి మార్పులు' పేజీలలో నమోదవుతాయి. అప్రసంగాలు, దుశ్చర్యలను వెంటనే తొలగిస్తారు. అటువంటివి సృష్టించిన వారి సభ్యత్వం కూడా నిషేధిస్తారు. ఇందులో సభ్యులుగా వుండి ఈ కార్యక్రమాలన్నిటిలోనూ పాలుపంచుకోవాలంటే కొన్ని నిబంధనలకు, కట్టుబాట్లకు లోబడితే చాలు. అలాగే వికీపీడియాలోని వ్యాసాలను ఎవరైనా ఉచితంగా చదువుకోవచ్చు. అవసరమైన వ్యాసాలను ప్రింటు తీసుకోవచ్చు. పైసా ఖర్చులేకుండా వికీపీడియా మొత్తాన్ని మీ కంప్యూటర్‌లోకి డౌనులోడు చేసుకోవచ్చు. ప్రింట్ చేసి, పుస్తకాలు కుట్టేసుకోవచ్చు. ఆ పుస్తకాలను అమ్ముకోనూవచ్చు. వికీపీడియా మిమ్మల్ని పన్నెత్తి మాటనదు, పైసా డబ్బడగదు. ఒకే ఒక్కమాట – దీన్ని నేను వికీపీడియా నుండి సేకరించాను అని రాస్తే చాలు.

తెలుగు వికీపీడియా (తెవికీ)

మొట్టమొదట ఆంగ్ల భాషలో ప్రారంభమైన వికీపీడియా ప్రపంచ నలుమూలల నుండి సమాచారం సేకరించడం, భద్రపరచడం సాధ్యమేనని రుజువు చేసింది. తర్వాతి దశలలో ప్రపంచ భాషలన్నిటిలో ఆయా భాషాభిమానుల కృషితో వికీపీడియా అనే ఉచిత విజ్ఞాన సర్వస్వం అభివృద్ధిపథంలో నడవటం మొదలైంది. అందులో భాగంగానే 2003 డిసెంబర్ 9న తెలుగు వికీపీడియా ఆవిర్భవించింది.

తెలుగులో విజ్ఞాన సర్వస్వాలు చాలా అరుదు. అందునా 'ఎన్‌సైక్లోపీడియా బ్రిటానికా' లాంటి బృహత్తర విజ్ఞాన సర్వస్వం అసలు లేనేలేదు. సాహిత్య అకాడమీ ప్రచురించిన విజ్ఞాన సర్వస్వం ఉన్నా, అది సాహిత్య విషయాలకే పరిమితమైంది. ఆవకాయ నుండి అంతరిక్షం దాకా, అటుకుల దగ్గర నుండి అణుబాంబు దాకా ప్రతీ విషయాన్ని వివరిస్తూ సాగే విశాల, విశిష్ట విజ్ఞాన సర్వస్వాన్ని తయారుచెయ్యడమంటే మామూలు విషయం కాదు. అపార ధనవ్యయం, అశేషమైన పనిగంటలు, అనంతమైన పరిశోధన అవసరం. సకల వనరులూ ఉన్న ప్రభుత్వమో, డబ్బును గుమ్మరించగల పోషకులో పూనుకుంటే తప్ప, ఇలాంటి మహత్కార్యాలు సాధ్యంకావు. అటువంటి బృహత్కార్యాన్ని సాధించేందుకు పూనుకున్నది ప్రభుత్వమో, సంపన్నులో కాదు. మనలాంటి సామాన్యులైన ఔత్సాహిక తెలుగు తేజాలు. వీరంతా భుజం భుజం కలిపి పని చేస్తున్నారు. ఒక్కరు కాదు, ఇద్దరు కాదు.. వందలమంది ఉత్సాహవంతులు నిరంతరం శ్రమిస్తూ, కోట్లాది మందికి ఉపయోగపడే ఒక విజ్ఞానకోశాన్ని తయారు చేస్తున్నారు. వారందరి నిరంతర కృషి ఫలితంగానే తెవికీ దినదిన ప్రవర్ధమానమవుతూ వచ్చింది. తెలుగు వికీపీడియా ప్రస్తుత సభ్యుల సంఖ్య 17,624. ఇందులో 47,112 వ్యాసాలున్నాయి.

భారతీయ భాషల్లో...

ప్రస్తుతం వికీపీడియా సుమారు 20 భారతీయ భాషల్లో అందుబాటులో వుంది. హిందీ, సంస్కృతం, బెంగాలీ, గుజరాతీ, మరాఠీ, పంజాబీ, అస్సామీ, మణిపురి, భోజ్‌పురి, కాశ్మీరీ, ఒరియా, తమిళం, మలయాళం, కన్నడ, ఉర్దూ, తెలుగు ఇలా దాదాపుగా అన్ని ప్రముఖ భారతీయ భాషల్లోనూ వికీపీడియా తయారవుతోంది. ప్రస్తుతం భారతీయ భాషలలో అత్యధిక వ్యాసాలున్నది హిందీ వికీపీడియాలోనే. కాగా ఇతర ప్రాంతీయ భాషలలోగల వికీపీడియాలలో వ్యాసాల సంఖ్యలోగానీ, సభ్యుల సంఖ్యలో గానీ తెలుగు వికీపీడియాదే అగ్రస్థానం.

తెలుగు వికీపీడియాలో ఏమేం రాస్తున్నారు?

తెలుగు వికీపీడియా వెబ్ అడ్రసు: http://te.wikipedia.org. చరిత్ర, సంస్కృతి, ప్రముఖ వ్యక్తులు, సినిమా, భాష, నగరాలు, పట్టణాలు, గ్రామాలు, రచయితలు, కంప్యూటర్లు, సైన్సు, రాజ్యాంగ వ్యవస్థ, నదులు.. ఇలా ఎన్నో విషయాలపై రాస్తున్నారు. 17 వేలకు పైగా సభ్యులు 47 వేలకు పైగా వ్యాసాల మీద ప్రస్తుతం పని చేస్తున్నారు. ప్రఖ్యాత రచయితలు, సంఘసేవకులూ వికీపీడియాలో రాస్తున్నారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని గ్రామాల గురించీ రాయాలనే సంకల్పంతో సభ్యులు రేయింబవళ్ళు కృషి చేస్తున్నారు. భారత్, అమెరికా, కెనడా, బ్రిటను, ఫ్రాన్సు, కొరియా, ఆస్ట్రేలియా ఇలా ప్రపంచం నలుమూలలలోనూ ఉన్న తెలుగువారు ఈ పనిలో నిమగ్నమై వున్నారు. అందువల్ల ఎల్లవేళలా వికీపీడియాలో ఎవరో ఒకరు రాస్తూనే ఉంటారు.

ఇంత శ్రమకోర్చి, అష్టకష్టాలు పడి తయారుచేస్తున్న ఈ స్వేచ్ఛా విజ్ఞాన సర్వస్వంను ఊరికినే ఎవరికిబడితే వాళ్ళకు ఇచ్చెయ్యడానికేనా? అంటే! అవును.... ఖచ్చితంగా అందుకే!! విశ్వంలో లభ్యమయ్యే విజ్ఞానాన్నంతా పోగుచేసి ప్రజలందరికీ ఉచితంగా అందించాలనే సదాశయంతోనే వికీపీడియా మొదలయింది. ఈ సైట్ స్థాపనకు ప్రాతిపదికే అది. అయితే ఈ మహా యజ్ఞానికి

జిమ్మీ వేల్స్

లారీ సాంగర్

వికీపీడియా చీఫ్ ఎగ్జిక్యూటివ్ సూ గార్డెనర్

ప్రపంచవ్యాప్తంగా విజ్ఞాన విస్తృతికి వికీపీడియాను వేదికగా మార్చుకుంటోంది. లాభాపేక్ష లేకుండా నడిచే వికీపీడియా మారుతున్న కాల, మాన పరిస్థితులకు అనుగుణంగా సమాచార లభ్యత, దాన్ని ప్రజలకు చేరువ చేయడం, తదితర అంశాల్లో ఎన్నో మార్పులను స్వీకరించింది. ఓ పెద్ద ఆశతో ప్రారంభించిన వికీపీడియా ప్రస్తుతం ఎవరూ ఊహించజాలనంత స్థాయిలో ఆదరణను చూరగొనడం చాలా సంతోషకరంగా ఉన్నట్లు వికీపీడియా చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారి సూ గార్డెనర్ వ్యాఖ్యానించారు. పదేళ్ల ప్రస్థానం తరువాత సుమారు 253 భాషల్లో వికీపీడియా లభ్యమవుతోంది. సుమారుగా 2 కోట్ల 60 లక్షల వివరాలు నమోదయ్యాయి. లక్షలాది మంది ప్రపంచవ్యాప్తంగా వికీపీడియాను సందర్శిస్తుంటారు. ప్రపంచంలోని మారుమూల ప్రాంతాల ప్రజలకు చేరువకావాలన్నదే తమ ఆశయమని గార్డెనర్ తెలిపారు. వర్ధమాన దేశాల నుంచి ఆన్‌లైన్ సంప్రదింపులు నెరిపేందుకు మొబైల్‌ఫోన్ల ద్వారా ప్రయత్నించే వారిని సంతృప్తిపరిచే దిశలో ప్రయత్నాలు సాగిస్తున్నామన్నారు. అమెరికాకు వెలుపల తొలిగా భారత్‌లోనే వికీపీడియా కార్యాలయాన్ని ప్రారంభించింది. సమాచారం కోసం ఎదురు చూసే మధ్యతరగతి భారతీయులను దృష్టిలో పెట్టుకొని వారి ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా సేవలందిస్తున్నట్లు గార్డెనర్ చెప్పారు.

ఖర్చు కూడా అదేస్థాయిలో అవుతుంది. సర్వర్లు, ఇతర మిషన్లు కొనడానికి, హోస్టింగుకు అవసరమైన ఖర్చుల కోసం అవసరమయ్యే మొత్తాన్ని విరాళాల రూపంలో సేకరిస్తారు. సాఫ్టువేర్‌ను అభివృద్ధి చేసేవారు స్వచ్ఛందంగానే చేస్తారు. వ్యాసాలు రాసేవాళ్ళు సైతం అందులో భాగస్వాములే. ఎవరికి తెలిసిన విషయాలను వారు ఉచితంగానే రాస్తుంటారు. ఈవిధంగా రాస్తూ పోతే వికీపీడియాలో ఎంతటి విషయ సంపద పోగుపడుతుందో ఊహకందనిది. ఇందులో ఎవరైనా రాయవచ్చు, ఇతరులు రాసిన వ్యాసాలను సరిదిద్దనూ వచ్చు. దేని గురించి రాయవచ్చు? మీకు తెలిసిన ఏ విషయం గురించైనా రాయవచ్చు. మీ ఊరి గురించి రాయవచ్చు. మీ ఊరి ఫోటోను పేజీలో పెట్టవచ్చు. అంతేగాకుండా ఈ మధ్య మీరు చదివిన పుస్తకం గురించో, మీరు చూసిన సినిమా గురించో రాయవచ్చు. అయితే సభ్యత్వం లేనివారు రాస్తే వారి పేరు నమోదు కాదు.

ఇప్పుడో అనుమానం కూడా రావచ్చు. అంతా బాగానే వుంది. రాయడం ఎలా? ఏ ఫాంట్‌తో రాయాలి? అనే సందేహాలు సహజం. తెలుగు యూనికోడ్‌లో టైప్ చేయడానికి అనేక ఉపకరణాలున్నాయి. లేఖిని, స్వేచ్ఛ, బరహ వంటి ఉపకరణాల ద్వారా చక్కని తెలుగులో టైప్ చేయవచ్చు. అదికూడా మనకు తీరిక దొరికిన సమయంలోనే. 'తెవికీ'లో రాసే సభ్యులంతా అలా రాసేవాళ్ళే! అంతేకాకుండా భాషా పరిజ్ఞానం పరిమితమనో, తప్పులు దొర్లుతాయనో భయపడనక్కర్లేదు. వికీపీడియా సభ్యులకిది అనుభవమే. మీ రచనలోని భాషాదోషాలను సరిదిద్దడానికి ఇతర సభ్యులు సదా సిద్ధంగా ఉంటారు. కాబట్టి దోషాల గురించి చింత అక్కరలేదు. "వెనకాడవద్దు, చొరవ చెయ్యండి" అనేది వికీపీడియా విధానాల్లో ఒకటి. చొరవ చేసి రచనలు చెయ్యండి. అలా రాసుకుంటూ పోతుంటే మీ భాష వికసిస్తుంది. అనుభవజ్ఞులైన సభ్యులు చేదోడుగా వుంటారు.

మీరూ వికీపీడియాలో చేరండి. మీ స్నేహితులనూ చేర్పించండి. భావితరాల వారికి ఒక ఉచిత విజ్ఞాన సర్వస్వాన్ని అందించడంలో చేయి కలపండి.

వికీపీడియా ఎవరిది?

వికీపీడియాని మాతృసంస్థ అయిన 'వికీమీడియా ఫౌండేషన్' నిర్వహిస్తోంది. ఇదివరలో ఈ సైట్ జిమ్మీవేల్స్‌కు చెందిన బొమిస్ inc అనే కంపెనీ సర్వర్లలో వుండేది. జూన్ 20, 2003న 'వికీమీడియా ఫౌండేషన్' ఏర్పాటు చేసిన తరువాత డొమైన్ పేర్లు, సాంకేతిక పరికరాలు ఫౌండేషన్‌కు బదిలీ అయ్యాయి. ఉచిత విజ్ఞాన సర్వస్వం అనే సిద్ధాంతాల మార్గదర్శకత్వంలో వికీపీడియన్ల సముదాయం ప్రస్తుతం ఈ సైటును నిర్వహిస్తున్నది. ఈ సైటులో ప్రచురించిన వ్యాసాలన్నీ ఆయా రచయితలు GNU Free Documentation Licenseకు లోబడి వెలువరిస్తారు. కాబట్టి ఈ వ్యాసాలన్నీ ఉచితం. వీటిని నిబంధనలకు లోబడి ఉచితంగా వాడుకోవచ్చు. వికీపీడియా వ్యాసాలను ఎలా వాడుకోవచ్చో తెలుసుకోవడం వెబ్‌సైట్‌లోని 'కాపీ హక్కులు' మరియు 'పాఠకుల ప్రశ్నలు' చూడండి.

వికీపీడియాలోని వ్యాసాలకు బాధ్యులెవరు?

ఇది ఒక సమష్టి ప్రయత్నం. వేలాది మంది ఈ ప్రాజెక్టులోని వివిధ భాగాలలో తమ వంతు పాత్రలను పోషిస్తున్నారు. మీతో సహ, ఎవరైనా చెయ్యవచ్చు. దీనికి పేజీని ఎలా దిద్దుబాటు చెయ్యాలనేది, ఇతరులతో పంచుకోడానికి కాస్త విజ్ఞానం తెలిస్తే చాలు. ఈ విజ్ఞాన సర్వస్వం వినియోగదారులకు కొంత స్వేచ్ఛనిస్తుంది.

ఒక పేజీలోని ఇటీవలి మార్పులు ఎవరెవరు చేసారనేది వెబ్‌సైట్‌లో **"పేజీ చరితం"** అనే లింకును నొక్కి తెలుసుకోవచ్చు. ప్రస్తుతమున్న కూర్పులో ఏమైనా తప్పులు గుర్తిస్తే, వాటిని సరిదిద్దటానికి చొరవగా ముందుకు రావొచ్చు. ఈ విజ్ఞాన సర్వస్వం యొక్క విశ్వసనీయతను కాపాడడంలో ఇదొక మౌలిక అంశం.

అంతేకాకుండా ఏదైనా వ్యాసంలో పదాలు గానీ, వాక్యాలు గానీ అస్పష్టంగా, సందిగ్ధంగా అనిపిస్తే, ఆ భాగాన్ని ఉదహరిస్తూ సంబంధిత చర్చా పేజీలో ప్రశ్నించవచ్చు. తద్వారా వాటిని వెంటనే తీసివేసే వీలు కలుగుతుంది.

వికీపీడియా వెనుక...







వికీపీడియా 'మీడియా వికీ' అనే ఓపెన్ సోర్స్ సాఫ్ట్‌వేర్‌ను వాడుతోంది. అన్ని వికీమీడియా ప్రాజెక్టుల్లోను దీన్ని ఉపయోగిస్తారు. ఈ ప్రాజెక్టులన్నీ ప్రపంచవ్యాప్తంగా వున్న 100 సర్వర్లలో పనిచేస్తుంటాయి.

విధానాలు, మార్గదర్శకాలు...

వికీపీడియాకు కొన్ని విధానాలు, మార్గదర్శకాలున్నాయి. కొన్ని విధానాలు ఇంకా రూపుదిద్దుకొంటుండగా, కొన్ని ఇప్పటికే తయారై నిర్వివాదంగా పని చేస్తున్నాయి. విధానాలు ఒక పక్కన రూపు దిద్దుకొంటుండగా, అన్ని రకాల దుశ్చర్యలను అరికట్టడానికి ఈ నియమాలు సరిపోవని కొందరు వికీపీడియన్లు భావిస్తున్నారు. ఉదాహరణకు, వికీపీడియా స్ఫూర్తికి విరుద్ధంగా ప్రవర్తించే వారిని – వారు నియమాలను అతిక్రమించక పోయినా – మందలించవచ్చు. సద్బుద్ధితో దిద్దుబాట్లు చేసే వారికి, మర్యాదగా ఉండేవారికి, ఏకాభిప్రాయం కోసం ప్రయత్నించేవారికి, నిష్పాక్షికమైన సర్వస్వాన్ని తయారు చెయ్యడానికి ప్రయత్నించే వారికి, అనుకూల వాతావరణం ఉండాలి.

వికీ సమాజం లక్ష్యం-కీలక విధానాలు

వికీపీడియాలో రాయడానికి ముందు ప్రతీ విధానాన్నీ చదవనవసరం లేదు! అయితే, కింద పేర్కొన్న విధానాలు మాత్రం తప్పనిసరి. వీటిపై ఎంత పట్టు సాధిస్తే మీ వికీపీడియా అనుభవం అంత మెరుగుపడుతుంది.

1. వికీపీడియా ఒక విజ్ఞాన సర్వస్వం. ఇదే దాని లక్ష్యం, అంతకు మించి ఇంకేమీ లేదు. మరింత సమాచారం కొరకు ఏది వికీపీడియా కాదు చూడండి.

2. పక్షపాతం వీడండి. విషయంపై సత్యాలను, వాస్తవాలను వెల్లడిస్తూ నిష్పాక్షిక దృష్టితో వ్యాసాలు రాయాలి.

3. కాపీ హక్కులను ఉల్లంఘించ వద్దు. వికీపీడియా GNU ఫ్రీ డాక్యుమెంటేషన్ లైసెన్సు నిబంధనలకు లోబడి ఉన్న ఒక స్వేచ్ఛా విజ్ఞాన సర్వస్వం. కాపీ హక్కులను అతిక్రమించే వ్యాసాలను సమర్పిస్తే, ఉచిత విజ్ఞాన సర్వస్వాన్ని తయారు చెయ్యాలనే సంకల్పానికే విరుద్ధమేగాక చట్టపరమైన వివాదాలకు దారితీయవచ్చు (మరింత సమాచారానికై వెబ్‌సైట్‌లో **'కాపీ హక్కులు'** చూడండి.)

4. ఇతర సభ్యులను గౌరవించడం. వికీపీడియా సభ్యులు విభిన్న అభిప్రాయాలు కలిగిన వారు. ఇతరులను గౌరవించడం అనేది ఈ ప్రాజెక్టు విజయానికి కీలకమైనది. (కొన్ని మార్గదర్శకాల కొరకు వికీపీడియా: **సాంప్రదాయం,** వికీపీడియా: **సంవాద నియమాలు,** వికీపీడియా: **మర్యాద, వివాద పరిష్కారం** చూడండి.)

మూడు ప్రాథమిక నియమాలు

వికీపీడియాలో రాసే అంశాలు మూడు మౌలిక సూత్రాలకు కట్టుబడి ఉండాలి. ఈ మూడు మౌలిక సూత్రాలూ సభ్యుల అంగీకారం ద్వారా కూడా మార్చడానికి వీలు లేదు. 1. తటస్థ దృక్కోణం 2.మౌలిక పరిశోధనలు నిషిద్ధం 3. నిర్ధారింప తగినది. వీటితోపాటు ఇతర విధివిధానాలు, మార్గదర్శకాలు అన్నింటినీ వెబ్‌సైట్‌లో చూడొచ్చు.

(మూలం : వికీపీడియా నుండి సేకరణ)

కథ

“సారీ, ఇప్పుడు అబార్షన్ [illegible] జరగాలి. ఇప్పుడు [illegible] అబార్షన్ [illegible] ప్రమాదం” డాక్టర్ [illegible]

అనామిక

- ఆదోని బాషా

“రిస్క్ తీసుకోడానికి మేం సిద్ధంగా వున్నాం. అబార్షన్‌కి ముందే అగ్రిమెంట్‌పై సంతకాలు పెడతాం. మీరు ప్రయత్నించండి” రామచంద్ర మొండిగా అన్నాడు.

డాక్టర్ అతని వైపు తీక్షణంగా చూసి “చూడు మిస్టర్, మేం డాక్టర్లం. కసాయిలం కాదు. మేం డబ్బు పుచ్చుకునేది ప్రాణాలు కాపాడటానికి కానీ తీయటానికి కాదు. బిడ్డ వల్ల తల్లి ప్రాణాలకు ప్రమాదముంటే తప్ప అబార్షన్‌కి మెడికల్ రూల్స్ ఒప్పుకోవు. గర్భంలో పెరుగుతున్న పిండం ఆడపిల్ల అని తెలుసుకుని అబార్షన్ చేయించాలనుకోవటం అనైతికం. నేరం. చట్టప్రకారం శిక్షార్హం. అందువల్ల అబార్షన్ ఆలోచన మానుకుని కాన్పు అయ్యేవరకు మీ భార్య ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకోండి” డాక్టర్ అతనికి హితబోధ చేసింది.

రామచంద్ర అసహనంతో లేచి బయటికొచ్చాడు. అతని వెనకే వచ్చిన లలిత బేలగా అతని వైపు చూసి మెల్లగా “ఊర్లోని డాక్టర్లందరూ అబార్షన్ వద్దంటున్నారు. అందువల్ల ఈ ఒక్కపిల్లని ఈ లోకంలోకి రానిద్దామండి. ఈ పిల్ల రాకతోనైనా మన కష్టాలు తీరతాయేమో. బహుశా అందుకే ఆ దేవుడు అబార్షన్ జరగనివ్వటం లేదేమో...”

భార్య మాటలు రామచంద్రపై ఏమాత్రం ప్రభావం చూపలేదు. అతని పెళ్ళై పదేళ్ళయ్యింది. తొలి సంతానం ఆడపిల్ల. అయిదేళ్ళ తర్వాత రెండో కాన్పులోనూ ఆడపిల్ల పుట్టింది. మూడో బిడ్డ వద్దనుకున్నాడు. కానీ ఒక్క కొడుకైనా వుండాలనే తలంపుతో కుటుంబ నియంత్రణ పాటించలేదు. ఈసారి భార్య గర్భం దాల్చాక కొత్తగా అందుబాటులోకి వచ్చిన స్కానింగ్ పరిజ్ఞానంతో గర్భంలో పెరుగుతున్నది ఆడపిల్లని ముందే తెలుసుకున్నాడు. ఇక అబార్షన్ కోసం అతను చెయ్యని ప్రయత్నం లేదు. నగరంలోని ఆస్పత్రులన్నీ తిరిగాడు. అన్నిచోట్లా ఒకటే సమాధానం సమయం మించిపోయిందని. రామచంద్రకి ఆడసంతానంపై ఎందుకంత వ్యతిరేకతో తెలియాలంటే మనం కాస్త అతని గతంలోకి తొంగి చూడాలి.

తన తండ్రికి నలుగురు ఆడపిల్లల తర్వాత ఆఖరి సంతానంగా రామచంద్ర పుట్టాడు. నలుగురు అక్కల పెళ్ళిళ్ళకు తండ్రి సంపాదించిన ఆస్తంతా హారతి కర్పూరంలా కరిగిపోవటం కళ్ళారా చూశాడు. తర్వాత తండ్రి అనారోగ్యం పాలై వైద్యానికి డబ్బుల్లేక అకాల మరణం చెందాడు. చివరికి అతని తల్లి నానా చాకిరీ చేసి అతన్ని చదివించింది. చివరి సంవత్సరం చదవడానికి డబ్బుల్లేక తన మంగళ సూత్రాన్ని సైతం అమ్మేసింది. ఎలాగోలా రామచంద్రకి చిన్న ఉద్యోగం దొరికింది. తమ కష్టాలన్నీ తీరిపోయాయనుకుంటున్న సమయంలో దారుణమైన విషయం బయటపడింది. తల్లికి క్యాన్సర్. చాలాకాలం ఆమె తన అనారోగ్యాన్ని దాచిపెట్టడం వల్ల జబ్బు బాగా ముదిరిపోయింది. తల్లి చికిత్స కోసం అతను చెయ్యని ప్రయత్నంలేదు. పడని పాట్లులేవు. అప్పులు దొరక్క చివరికి తనను తాను అమ్ముకోవటానికి సిద్ధపడ్డాడు. అలా లలితతో అతని పెళ్ళి జరిగింది. కట్నానికి బదులుగా తన తల్లి చికిత్సకి అయ్యే ఖర్చుని భరించాలని లలిత తండ్రితో అతను పెళ్ళికి ముందే ఒప్పందం కుదుర్చుకున్నాడు. లలిత తండ్రి మాట మీద నిలబడ్డాడు. అల్లుడికిచ్చిన వాగ్దానం ప్రకారం అతని తల్లి చికిత్సకి అయిన ఖర్చులన్నీ భరించాడు. డబ్బు తక్కువైతే ఇంటిని సైతం అమ్మేశాడు. అయినా రామచంద్ర తల్లి బతకలేదు. అలా అతని యవ్వనమంతా ఇలాంటి విషాద ఘట్టాలతోనే గడిచిపోయింది. తన కష్టాలన్నిటికీ మూల కారణం ఆడపిల్లలే అని మనసులో గట్టిగా ముద్రపడిపోయింది. ఆడజన్మని పెద్ద దురదృష్టంగా నమ్మసాగాడు. ఇప్పుడు తన భార్య గర్భంలో పెరుగుతున్న 'దురదృష్టం' ఈ లోకంలోకి రాకుండా అడ్డుకోవటం వెనక ఇంత కథ దాగుంది.

రోజులు గడుస్తున్నాయి. లలిత గర్భంలోని పిండం పెరుగుతోంది. దాంతోపాటు రామచంద్రలో అసహనమూ పెరుగుతోంది. భార్య బాగోగులు చూడ్డం మానేశాడు. లలితకి నెలలు నిండక ముందే ఓ రోజు నొప్పులు మొదలయ్యాయి. రామచంద్ర వెంటనే భార్యను ఆస్పత్రిలో చేర్పించాడు. నెలలు నిండకముందే జరిగే కాన్పు వల్ల బిడ్డ ప్రాణాలకు ప్రమాదమని ఎవరో చెప్పారు. అప్పుడతని మదిలో క్రూరమైన ఆశ పుట్టింది. ఈ రకంగానైనా బిడ్డ పోవాలని కోరుకున్నాడు. కాని అతనూహించని విధంగా ఆ కాన్పులో బిడ్డ క్షేమంగా బయటపడి లలిత చనిపోయింది. ఓ పక్క భార్యావియోగం. మరోపక్క గుండెల మీద కుంపటిలా మరో ఆడసంతానం. ఈ పిల్లరాకతో తమ జాతకాలు మారతాయని లలిత ఆశపడింది. కాని నష్ట జాతకురాలు ఈ లోకంలోకి రాగానే కన్నతల్లినే మింగేసిందనే ఆలోచనతో అతనికి ఆ బిడ్డపై ఏహ్యాభావం కలిగింది. దాంతో కనీసం కన్నెత్తి చూడలేదు.

బంధుమిత్రులు, చుట్టుపక్కల వారే ఆ పిల్ల బాగోగులు చూసుకునేవారు. తండ్రి నిరాదారణ వల్ల పిల్లకు నామకరణం కూడా జరగలేదు. ఏ పేరూ లేని పిల్ల కాబట్టి 'అనామిక' అని పిలిచేవారు. చివరికి అదే పేరు స్థిరపడిపోయింది.

ఊహ తెల్సినప్పటి నుంచి అనామిక తనను తాను తల్లిని మింగిన రాక్షసిగానే భావించింది. తండ్రి ఎక్కడికైనా బయల్దేరేటపుడు పొరపాటున ఎదురుపడితే “ఛీ... ఛీ.. దరిద్రపు ముఖంతో ఎదురొచ్చావ్. ఉదయాన్నే అపశకునం. ఈ రోజు ఏ పనీ కాదు” అంటూ చీదరించుకునేవాడు. తండ్రి మాటలకు ఆ చిన్నారి మనసు తల్లడిల్లిపోయేది. తల్లిని తల్చుకుని వెక్కివెక్కి ఏడ్చేది. అమ్మతోపాటు నేను కూడా చచ్చిపోయి వుంటే బావుండేదంటూ కుమిలిపోయేది. అక్కలిద్దరూ ఆమెను ఓదార్చేవారు.

కూతురి పట్ల ఏహ్యాభావం వల్ల రామచంద్ర ఆమెను స్కూల్లో కూడా చేర్పించలేదు. అయితే చదువు పట్ల ఆసక్తితో అక్కలు చదువుతుంటే గమనించేది. దొంగచాటుగా వాళ్ళ పుస్తకాలు తీసి చదివే ప్రయత్నం చేసేది. వాళ్ళ పక్కింట్లో వుండే టీచర్ అనామికలో చదువు పట్ల వున్న ఆసక్తిని పసిగట్టి ఉచితంగా ఆమెకు ట్యూషన్ చెప్పింది. తర్వాత తను పనిచేసే స్కూల్ యాజమాన్యానికి అనామిక ప్రతిభ గురించి చెప్పింది. వారు ఉచితంగా అనామికను స్కూల్లో చేర్చుకున్నారు. అలా అనామిక స్కూలు జీవితం మొదలైంది.

స్కూల్లో ఆమెకు సారిక అనే ధనవంతుల అమ్మాయితో స్నేహం కుదిరింది. సారికది కాస్త మొద్దుబుర్ర. అయితే అనామిక స్నేహంతో ఆమె కూడా చదువులో పదునుదేలింది. అనామిక వల్ల తన కూతురిలో వచ్చిన మార్పుని గమనించిన సారిక తండ్రికి ఆమె పట్ల కృతజ్ఞతా భావం కలిగింది. ఆమెకు చేతనైన సాయం చెయ్యాలనుకున్నాడు. తన కూతురితో పాటు అనామికనూ కాలేజీలో

చేర్పించాడు.

ఇద్దరూ మెడికల్ ఎంట్రెన్స్ రాశారు. ఇద్దరికీ మంచి మార్కులొచ్చాయి. గవర్నమెంటు మెడికల్ కాలేజీలో చేరడానికి వెయిటింగ్ లిస్టులో వారి పేర్లు నమోదయ్యాయి. సీట్లు భర్తీ అయ్యాక కోర్సు చేసే అవకాశం అనామికకి మాత్రమే లభించింది. ఒక్క మార్కు తేడాతో తన కూతురు సీటు కోల్పోయిందని తెలిసి సారిక తండ్రి ఎంతో బాధపడ్డాడు. అప్పుడే అనామిక తన ఔన్నత్యాన్ని చాటుకుంది. మరో వూళ్లో చదవటం తన తండ్రికి ఇష్టం లేదనే సాకుతో తనకొచ్చిన సీటుని రద్దు చేసుకుంది. తర్వాతి ర్యాంకు సారికది కావటంతో ఆ సీటు సారికకి లభించింది. అలా అనామిక తన స్నేహితురాలి రుణం తీర్చుకుంది. సారిక మెడిసిన్‌లో చేరాక ఆమె తండ్రి అనామికను డిగ్రీ చదివిస్తానన్నాడు. ఆమె సున్నితంగా తిరస్కరించింది. తన అక్కల పెళ్ళిళ్ళ కోసం తండ్రి పడుతున్న కష్టాల్ని చూశాక పై చదువులు చదవటానికి ఆమెకు మనస్కరించలేదు. కొన్నాళ్ళు నర్సు ట్రైనింగ్ తీసుకుని నగరంలోని ఓ పెద్ద ఆస్పత్రిలో నర్సుగా చేరింది. ఉద్యోగం చేస్తూ తండ్రికి ఆసరాగా మారింది.

అప్పటికి ఎంతో కష్టం మీద రామచంద్ర పెద్ద కూతుళ్ళిద్దరి పెళ్ళిళ్ళు చేసి వూపిరి పీల్చుకున్నాడు. అనామిక మాత్రం తన కూతురు కాదన్నట్టు నిర్లిప్తంగా వుండిపోయాడు. అయినా అనామిక బాధ పడలేదు. ఉద్యోగం చేస్తూ తండ్రికి వండిపెడుతూ తన బాధ్యత నిర్వర్తించసాగింది.

రామచంద్రకి ఓసారి తీవ్రమైన గుండెపోటు వచ్చింది. అనామిక ఆగమేఘాల మీద తండ్రిని తను పనిచేసే ఆస్పత్రికి తీసుకెళ్ళింది. రామచంద్రకి అత్యవసర చికిత్స అందించాక డాక్టర్ ఆమెను తన క్యాబిన్‌లోకి పిలిచి "మీ నాన్నకి వచ్చిన గుండెనొప్పి సాధారణమైంది కాదు. ఆయన గుండె కండరాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. అవి మళ్ళీ మామూలుగా మారే అవకాశం లేదు. రోజురోజుకీ బలహీనమవుతాయి. కాబట్టి ఆయన ఎక్కువ రోజులు బతకడు" అని చెప్పాడు. తన తండ్రిని ఎలాగైనా కాపాడమని డాక్టర్ కాళ్ళు పట్టుకుని బతిమలాడింది అనామిక . "పుట్టినప్పుడే తల్లిని పోగొట్టుకున్నాను. ఇప్పుడు తల్లీ తండ్రీ అన్నీ మానాన్నే. ఎలాగైనా ఆయన్ని కాపాడండి డాక్టర్" అంటూ చిన్నపిల్లలా ఏడ్చింది.

ఆమె దుఃఖం చూసి "మీ నాన్న బతకాలంటే ఆయనకు వెంటనే హార్ట్ ట్రాన్స్ ప్లాంటేషన్ జరగాలి. అందుకు లక్షలు ఖర్చవుతాయి. వెంటనే గుండె మార్పిడి జరగాలంటే ముందు గుండె దొరకాలి. ఈ ఆపరేషన్ చేయడానికి విదేశాల్లో శిక్షణ పొందిన సర్జన్లు కావాలి. వాళ్ళ ఫీజు లక్షల్లో వుంటుంది. అంత డబ్బు ఎక్కడ్నుంచి వస్తుంది" డాక్టర్ నిరాశగా అన్నాడు.

కాని అనామిక నిరాశ పళ్ళేదు. తన తండ్రిని కాపాడుకోడానికి ప్రయత్నాలు మొదలెట్టింది. సంఘసేవా సంస్థలు, రాజకీయ నాయకులు, ప్రభుత్వ అధికారుల చుట్టూ తిరిగింది. తన తండ్రి పరిస్థితిని వివరిస్తూ ఇంటర్‌నెట్ ద్వారా అంతర్జాతీయ వైద్య సంస్థల సాయాన్ని అర్థించింది. ఆయన ప్రాణాలు కాపాడ్డానికి ఎవరైనా ముందుకు రావాలని కోరుతూ అనామిక ప్రతిరోజు గుడికెళ్ళి దేవుణ్ణి ప్రార్థించేది.

చివరికి ఆమె ప్రార్థన దేవుడు విన్నాడు. ఇంటర్‌నెట్‌లో ఇచ్చిన అభ్యర్థనకు స్పందించి న్యూయార్క్ నుంచి ఓ డాక్టర్ల బృందం వచ్చింది. వాళ్ళను తీసుకొచ్చింది ఎవరో కాదు. అనామిక స్నేహితురాలు డాక్టర్ సారిక. ఎంబిబిఎస్ చదివాక పై చదువుల కోసం ఆమె అమెరికా వెళ్ళింది. కార్డియాలజీలో సర్జరీ కోర్సు చేసింది. ఇంటర్ నెట్‌లో అనామిక తండ్రి గురించి తెల్సుకున్నాక తన డాక్టర్ మిత్రులను వెంటబెట్టుకుని ఇండియా వచ్చేసింది. చాలాకాలం తర్వాత స్నేహితురాల్ని చూసిన అనామిక ఆమెను కౌగలించుకొని భోరున ఏడ్చింది. సారిక ఆమెను సముదాయించి ధైర్యం చెప్పింది. ఆపరేషన్ ఖర్చంతా తను భరిస్తానని భరోసా ఇచ్చింది. దాంతో అనామిక మనసు స్థిమితపడింది.

ఇచ్చిన మాట ప్రకారం ఆపరేషన్‌కి అన్ని ఏర్పాట్లూ సారికే చేసింది. మెడికల్ అసోసియేషన్ సాయంతో నగరంలోని అన్ని ఆస్పత్రుల్లోను దాతల నుంచి గుండె సేకరించటానికి ఏర్పాట్లు చేసింది. కానీ ఎన్ని ఏర్పాట్లు చేసినా డోనర్లు దొరకలేదు. రోజులు గడుస్తున్నాయి. రామచంద్ర గుండె రోజురోజుకీ బలహీనపడుతోంది. అతని శరీరం మృత్యువుకి దగ్గరపడుతోంది. అనామికలో ఆందోళన పెరగసాగింది. తండ్రి కోసం ఏదో ఒకటి చేయాలనే తపన పెరిగిపోతోంది.

సారికతో మాట్లాడుతూ మధ్యలో హఠాత్తుగాలేచి పక్కగదిలోకి వెళ్ళి తలుపుమూసి గడియ బిగించింది. ఆమె ఎందుకలా చేసిందో సారికకు అర్థంకాలేదు. కిటికీలోంచి తొంగిచూసింది. లోపల అనామిక స్టూలు మీదెక్కి ఫ్యాన్‌కి వురేసుకుంటోంది. అది చూసి సారిక గట్టిగా కేకలేసింది. అనామిక తన మెడకు తాడు బిగిస్తూ స్నేహితురాలితో అంది "నన్ను క్షమించు సారిక. నేను ఓడిపోయాను. పుట్టినప్పట్నించి మా నాన్నకు ఏ రకంగానూ ఉపయోగపడలేదు. నేను చనిపోయాక నా గుండె ఆయన్ని బతికిస్తే నా జన్మ ధన్యమైందనుకుంటాను. నా ప్రాణం పోగానే నా గుండె తీసి మా నాన్నను బతికించు" అంటూ తను నిల్చున్న స్టూల్‌ని కాళ్ళతో పక్కకి నెట్టేసింది. మరుక్షణం ఆమె కాళ్ళు గాలిలో కొట్టుకోసాగాయి.

అదే క్షణంలో సారిక కేకలు విని పరిగెత్తుకొచ్చిన జనం తలుపు బద్దలు కొట్టి గదిలోకి ప్రవేశించారు. గాలిలో తేలుతూ చావు బతుకుల మధ్య పెనుగులాడుతున్న అనామికను కిందికి దించి వెంటనే ఐసియులోకి తీసుకెళ్ళారు. అదే క్షణంలో సారిక ఫోను మోగింది. అనామిక తండ్రి కోసం గుండె దొరికిందని సిటీ సెంట్రల్ హాస్పిటల్ నుండి శుభవార్త వచ్చింది. రామచంద్ర హార్ట్ ట్రాన్స్‌ప్లాంటేషన్ విజయవంతంగా ముగిసింది. మరో పక్క అనామిక కూడా ప్రాణాపాయం నుంచి బయటపడింది. కొద్ది రోజుల్లో రామచంద్ర బాగా కోలుకున్నాడు. తనకు ఉచితంగా ఆపరేషన్ చేసి ప్రాణాలు రక్షించిన డాక్టర్ సారికకు మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలిపాడు.

"అంకుల్ నేనొక డాక్టర్‌గానే ఈ ఆపరేషన్ చేశాను. మీకు ప్రాణం పోసింది మాత్రం మీ కూతురే" ఓ మూల నిల్చుని వున్న అనామికను చూస్తూ అంది సారిక. రామచంద్రకి ఏమీ అర్థం కాలేదు. అతను అనామిక వైపు చూశాడు. ఆ చూపులో ఏ భావమూలేదు. అది చూసి సారిక తట్టుకోలేకపోయింది. అనామిక వారిస్తున్నా వినకుండా ఉద్వేగంతో 'నిజానికి నాకీ డాక్టర్ వృత్తి అనామిక పెట్టిన భిక్ష. నా కోసం ఆమె తన మెడికల్ సీటుని త్యాగం చేసింది. లేకపోతే ఈ రోజు నా స్థానంలో ఆమే వుండేది. ఆమె పుట్టుకను మీరు అపశకునంగా, మీ గుండెల మీద కుంపటిగా భావించారు. ఆ కుంపటే మీ గుండె కోసం ఎంతగా తాపత్రయపడిందో మీకు తెలుసా? మీ ఆపరేషన్ కోసం తెలిసిన వాళ్ళందరి కాళ్ళు పట్టుకుంది. ఇంటర్నెట్‌లో ఆమె వివరాలు చూసి నేను వచ్చాను. నా ద్వారా ఆమె దీనగాథ విన్న నా విదేశీ డాక్టర్ మిత్రులు కూడా స్వచ్ఛందంగా నా వెంట వచ్చారు. ఆపరేషన్ చేశారు" అంది.

గద్గస్వరంతో సారిక చెప్పిన మాటలు విన్న రామచంద్రకి విస్మయంలో కళ్ళు బైర్లుకమ్మాయి. పుట్టగానే తల్లిని మింగిన రాక్షసిగా ఇంతకాలం తను ఈసడించుకున్న కూతురి గుండెలో తనపట్ల ద్వేషం వుంటుందనుకున్నాడు. దానికి భిన్నంగా ఆమెలో ఇంతటి మమకారం దాగివుందని తెలిసి సిగ్గు, బాధ, పశ్చాత్తాపం ఒకేసారి కలిగాయి. ఇన్నేళ్ళుగా ఆ చిన్నారి మనసుని సూటిపోటి మాటలతో గాయపర్చినందుకు అపరాధభావంతో కుమిలిపోయాడు. తనకు దూరంగా నిల్చుని తనవైపు బేలగా చూస్తున్న కూతుర్ని కళ్ళతోనే దగ్గరికి రమ్మని పిలిచాడు. ఆ పిలుపు కోసమే జీవితకాలం ఎదురుచూసిన అనామిక చిన్నపిల్లలా పరుగెత్తుకొచ్చి తండ్రి భుజంపై తలవాల్చి కరువుదీరా ఏడ్చింది. ఆ దృశ్యం చూసి అక్కడున్న ప్రతి ఒక్కరి కళ్ళు చెమ్మగిల్లాయి.

"ఏడవకమ్మా. ఈ పాపిష్టి తండ్రి కోసం కన్నీరు కార్చకమ్మా. కూతురి మమకారాన్ని గుర్తించలేని కసాయివాణ్ణి. నిన్ను చంపాలనుకొన్న ఈ పాపాత్ముణ్ణి రక్షించటానికి నీ జీవితాన్నే అంతం చేసుకోవాలనుకున్నావా నా పిచ్చితల్లీ. మీ అమ్మ చనిపోడానికి కారణం నువ్వేనని నిందలేశాను. నిజానికి ఆమె చనిపోలేదు. నీ రూపంలో మళ్ళీ నా దగ్గరకొచ్చింది. మరో జన్మంటూ వుంటే నీకడుపున పుట్టాలనుందమ్మా" అంటూ చిన్నపిల్లాడిలా ఏడ్చాడు. ఈ మాటలన్నీ అతని హృదయపు లోతుల్లోంచి వుబికి వచ్చాయి. అతని గుండెలో దాగిన కల్మషమంతా కరిగి పశ్చాత్తాపమనే కన్నీళ్ళతో కలిసి జలజల రాలిపోయింది.

★

ఆదరిస్తే అద్భుతాలు!

సం(క్రాంతి సెలవులు ముగిసిపోయాయని కాస్త వుసూరంటూ బడికి బయలుదేరింది మహాలక్ష్మి. మళ్లీ పిల్లలు.. గోల్సు.. గొడవలు... అయితే అందులోనూ ఓ విధమైన ఉత్సాహం... స్కూల్లో అడుగు పెట్టిందో లేదో పిల్లలు గుడ్ మార్నింగ్ అంటూ చుట్టుముట్టారు షరా మామూలుగా. ఓపికను బట్టి స్పందిస్తూ లోపలకి నడిచింది. అప్పటికే ఆమె కోసం ఎవరో నిరీక్షిస్తున్నారు.

'మా అమ్మ వచ్చింది టీచర్' అంటూ పరిచయం చేసింది సీత.

'నీవేనా..' అంటూ పలకరించింది మహాలక్ష్మి.

'ఔ టీచర్' అందామె. 'మీరు పిలిచినరంటే వచ్చిన' అని జవాబిచ్చిందామె.

'ఏమిటి పాపను బడి మానేయమని గొడవ చేస్తున్నావట?' సూటిగానే అడిగింది మహాలక్ష్మి. ఆమెకది రోజూ వుండే తతంగమే.

'ఔ టీచర్.. ఇంటికాడ పని వుంటుంది. నేను కూలికి పోత. పిల్లాణ్ణి చూసుకోనీకి' అని బలహీనమైన వివరణ ఇచ్చింది.

'పాపను చూసుకోవడానికి ఈ పాపను పాడు చేస్తావా'

'ఏం లే టీచర్.. ఇంటి కాడ మంచిగుంటది..'

'ఎంత మంచిగుంటదో నిన్ను చూస్తే తెలియడంలా.. మీ ముసల్ది వుందంట కదా..'

'అదే టీచర్ నా చాతనైత లేదు అని లొల్లి పెడుతుంది..'

'ఆ ముసల్ది చూసుకోలేకపోతే ఈ పసిది చూసుకోగలదంటారా? ఏం మాట్లాడుతున్నారమ్మా మీ తల్లి బిడ్డలు ..' కాస్త గట్టిగానే అడిగింది మహాలక్ష్మి. ఏమీ తోచనట్టు తల దించుకుంది ఆమె.

'కావాలంటే నీ కొడుకు పై క్లాసుల్లో వున్నాడు కదా. వాణ్ని మాన్పించు, జులాయి వేషాలు వేయడం తప్ప చదువుకోవడం లేదు. సీత మంచి స్టూడెంటు. బాగా పైకొస్తుంది..' ఇక తిరుగు లేదన్నట్టు చెప్పింది.

'వాడు ఎందుకు మానేస్తాడు టీచర్ .. పది కావాలె కద..'

'వాడు పది కావాల.. ఈమె మాత్రం నాలుగు చదివితే చాలా! ఏం చెబుతున్నావమ్మా... చూడు ఇప్పటికే వాడి మీద చాలా ఫిర్యాదులొచ్చాయి. అల్లరి పనులు చేస్తున్నాడు. ఈ పాప చిన్నదైనా మధ్యాహ్నం ఇంటికి పోయి చెల్లిని చూసి ముసల్దానికి తిండి పెట్టి వస్తుంది. ఎలాగో ఏడు వరకైనా రానియ్యి.. కావాలంటే నీ మొగుణ్ని పంపించు.. నేను గట్టిగా చెబుతా..' అని పంపించేసింది.

◆◆◆

ఆమె వెళ్లిపోయినా మహాలక్ష్మిని ఆ ఆలోచనలు వదలడం లేదు. తనలో తను తర్కించుకుంటూనే వుంది. ఎన్ని రోజులు పోయినా ఎందుకని ఈ పరిస్థితి మారడం లేదు? ఆడపిల్లలను తక్కువగా చూస్తూనే వుంటారా? రోజూ స్కూల్లో తనకు చాలా సంగతులు తెలుస్తుంటాయి. పేదవాళ్లయినా, మధ్య తరగతి వారైనా, ఆఖరుకు పై క్లాసు వాళ్లయినా సరే ఆడపిల్లల విషయం వచ్చే సరికి ఏదో తక్కువన్నట్టు చేస్తుంటారు.

◆ అబ్బాయిలకోసం ఖర్చు చేయడం బాధ్యత. అమ్మాయిలపై పెట్టే ఖర్చు అదనం◆అబ్బాయి ఆస్తి తెస్తాడు. అమ్మాయి తీసుకుపోతుంది ◆అబ్బాయి ప్లస్. అమ్మాయి మైనస్ ◆అబ్బాయిలు ఏదైనా చేయగలరు, అమ్మాయిలు వంట పని, ఆఫీసు పని, టీచింగు వంటివి మాత్రమే చేయగలరు ◆అబ్బాయిలు బలంగా వుంటారు. అమ్మాయిలు దుర్బలులు ◆అబ్బాయిలు ఎప్పటికైనా తోడుంటారు. అమ్మాయిలు అత్తింటికి పోయేవారే ◆అబ్బాయిని ఎంతైనా చదివించవచ్చు. అమ్మాయిని కొంత వరకు చదివిస్తే చాలు ◆అబ్బాయిలు దట్టిగా వుంటారు. అమ్మాయిలు వూరికే ఏడుస్తారు. ◆అబ్బాయిలైతే ఒంటరిగా వెళ్లగలరు. అమ్మాయిలకు ఎప్పుడూ తోడుండాలి ◆అబ్బాయిలు చురుగ్గా వుంటారు. అమ్మాయిలు మొద్దులు ◆అబ్బాయిలు ఇట్టే అర్థం చేసుకోగలరు. అమ్మాయిలకు ఎంత చెప్పినా అర్థం కాదు ◆అమ్మాయిలు రక్షణ కోరేవారు. అబ్బాయిలు రక్షించేవారు ◆అమ్మాయిలను ప్రేమించడం అబ్బాయిల హక్కు. జాగ్రత్తగా వుండటం అమ్మాయిల బాధ్యత.

ఇవీ ఇలాటి మరెన్నొ తప్పు భావాలు వినీ వినీ విసుగు వస్తుంటుంది మహాలక్ష్మికి. ఇందులో ప్రతిదీ తప్పేనని ఆమె జీవితంలో స్వయంగా చూసింది. తనకు అబ్బాయి అమ్మాయిని చూసినప్పుడే కాదు ఇరుగు పొరుగు ఇళ్లలోనూ, బంధుమిత్రుల కుటుంబాల్లోనూ, బళ్లోనూ ఎక్కడ చూసినా వాస్తవాలు ఈ అభిప్రాయాలు తప్పని అర్థమైందామెకు.

చదువుకోవాలనే తపన చాలా సార్లు అమ్మాయిలలోనే ఎక్కువగా వుంటుంది. అది తమ వ్యక్తిత్వాన్ని పెంచుతుందని వారు తెలుసుకుంటున్నారు. చెప్పిందానిపై శ్రద్ధ కూడా ఎక్కువగా వుంటున్నది. పాటలు పాడటం, అభిరుచుల విషయంలోనూ అమ్మాయిలు ఎక్కువ ఆసక్తి చూపిస్తున్నారు. కొంతమంది అమ్మాయిల ఆసక్తికి ఆర్థిక స్థితికి మధ్య పొంతన కుదరని కథలు వింటుంటే తనకు బాధ కలుగుతుంటుంది. అన్నిటికన్నా విచిత్రమేమంటే పదోక్లాసు చదివే కుర్రాళ్లకన్నా అయిదో క్లాసుకు కూడా రాని పాపాయిలు కుటుంబం గురించి ఎంతగానో ఆలోచిస్తారు.

ఒకసారి ఒక పాప బయటకు వెళ్లడానికి పర్మిషన్ అడిగింది. ఎందుకంటే వాళ్లనాన్న తాగి వచ్చి వాళ్లమ్మను కొడితే ఆమె పడిపోయింది. ఈయన అలిగి అన్నం తినకుండా వెళ్లిపోయాడు. స్కూలు దగ్గరే ఎక్కడో వున్నాడట. అతన్ని తీసుకుని వెళ్లి అమ్మను కూడా లేపి అన్నం తినిపించి వస్తుందట! ఇంత బాధ్యతగా మాట్లాడిన అబ్బాయి ఎవరూ ఆమె కెరీర్‌లో తగల్లేదు. అయినా అబ్బాయిలే గొప్ప!

◆◆◆

మహాలక్ష్మి చిన్నప్పుడు సైకిల్ తొక్కేది. ఇంటి సరుకులన్నీ తెచ్చేది. వాళ్లనాన్న తాగి రావడం ఆలస్యమైతే తనే వీధులన్నీ తిరిగేది. అతని పిచ్చి పిచ్చి మాటలను తట్టుకుంటూ తిండి తినిపించేది. ఆడపిల్లల శక్తి సామర్థ్యాలేమిటో ఆమెకు స్వయంగా తెలుసు. ఇందుకు భిన్నంగా స్కూలు పిల్లల్లో కూడా చవటలు, పిరికి సన్నాసులు, మడ్డి మొహాల వంటి అబ్బాయిలను కూడా ఎంతోమందిని చూసింది. తెలివైన హుషారైన కుర్రాళ్లు ఎంత ముచ్చటగలిగిస్తారో కోతి వేషాలు, ప్రకృతి విధించే కొన్ని పరిమితులు మినహా అబ్బాయిలకు అమ్మాయిలకు ఏ తేడాలు వుండవని ఆమె గట్టిగా నమ్ముతుంది. సంక్షోభాలు ముంచుకొచ్చినపుడు, సవాళ్లు ఎదురైనప్పుడు తట్టుకునే శక్తి కూడా అమ్మాయిలకే ఎక్కువ. అభద్రత అన్న భావనను ప్రత్యేకంగా కూరకపోతే అమ్మాయిలు దూసుకుపోగలుగుతారని ఆమె అనేక మంది విషయంలో ప్రత్యక్షంగా తెలుసుకుంది. అందుకే అమ్మాయిలకు ప్రత్యేకంగా ప్రోత్సాహమిస్తుంది. రేపు సీత వాళ్లనాన్న కాస్త ఎక్కువ తక్కువ మాట్లాడాడో అయిపోయాడే అనుకుని తనలో తనే నవ్వుకుంది.

◆◆◆

మహాలక్ష్మిని, ఆమె స్టూడెంట్సును అక్కడే వదిలేసి మీరూ కాస్త ఆలోచించండి. ఆడపిల్లల పట్ల మనలో కరుడుగట్టి పోయిన ఆలోచనలు ఎంత పొరబాటో! ఆదరణ కోసం వారెంతగా పరితపిస్తున్నారో! కాస్త ఆత్మ విశ్వాసం పెంచితే ఎన్ని అద్భుతాలు సృష్టిస్తారో...!!

- పీపీ

కృత్రిమ కాలు

అనుకోకుండా కాలు విరిగిపోయింది ఒక కుక్కకు. నాలుగుకాళ్లలో ఒకటి పోతే ఏం. నడవొచ్చుగా. అనుకుంటే కుదరదు. కాళ్లు నాలుగూ వుండాల్సిందే. పోనీ కృత్రిమ కాలు పెట్టించుకుందామా అంటే కుక్కల దగ్గర డబ్బు వుండదుకదా. కానీ ఈ కుక్క యజమానికి ఆ ఆలోచన వచ్చింది. అనుకున్నదే తడవుగా డాక్టర్ని కలవడం, కృత్రిమ కాలు పెట్టించడం, అది చకచకా నడవడం అన్నీ జరిగిపోయాయి. మరి ఆ వివరాల్లోకి వెళదాం. ఈ శునక నామధేయం మిజి. దాని యజమాని పేరు డేవిస్. డోర్చెస్టర్ వాసి. ఓసారి ఈ కుక్క ఎందుకు పెట్టుకుందో ఏమో ఓ గుర్రంతో తలపడింది. అది దీని కాలు కాస్తా పచ్చడిపచ్చడిగా తొక్కేసింది. పాదం, గిలక...తీసేయాల్సి వచ్చింది. ఇంక మూడు కాళ్లతో కుంటుకుంటూ నడవడం మిజికే కాదు..డేవిస్‌కి కూడా నచ్చలేదు. తన పెంపుడు కుక్క నాలుగు కాళ్లతో దర్జాగా నడిస్తేనే బావుంటుందని ఫీలయ్యాడు డేవిస్. వెంటనే వైద్యులను కలిశాడు. కృత్రిమ కాలు ఏర్పాటు చేయమన్నాడు. డబ్బు ఎంతైనా ఫరవాలేదన్నాడు. మరి ఆమాటన్నాక డాక్టర్లు ఊరుకుంటారా! మిజి సమస్యకు తగ్గట్టుగా కాలు తయారుచేసి దానికి తగిలించేశారు. ఇప్పుడీ పెట్టుడు కాలు కూడా మిజి శరీరంలో భాగంగా తయారైంది. ఇంక ఇప్పుడు తన కొత్త కాలుతో మిజి నడక చూడాలీ... వయ్యారంగా...విలాసంగా...

ఆ గోళ్లు పొడవు మీటరు

గోళ్లు పెంచుకునేవారు మనలో కూడా వుంటారు. కాకపోతే అవి రెండునెలలకో, ఆ తర్వాతో విరిగిపోతుంటాయి. అయినా సరే మళ్లీ పెంచడం మొదలెడతాం. ఇదిగో ఈ నఖ ప్రియుణ్ణి చూశారూ... పేరు లీ జియాన్‌పింగ్. 15 ఏళ్లగా తన ఎడమ చేతి గోళ్లు పెంచుతున్నాడు. ప్రస్తుతానికి వాటి పొడవు మీటరు పైమాటే. దానికి చాలా కష్టపడాలంటే



నమ్మండి. రాత్రి పూట ఎడమ చేతిని తల కింద పెట్టుకొని పడుకుంటాడు లీ. ఎందుకంటే నిద్రలో ఎటంటే అటు కదిలిస్తే...పొరపాటున గోళ్లు విరిగిపోతాయని భయం. వాస్తవానికి లీ పాతికేళ్ల కిందటే గోళ్లు పెంచనారంభించాడు. రెండు సార్లు విరిగిపోయాయి. సరేగానీ...అసలు లీకి ఈ ఆలోచన ఎలా వచ్చింది? అనుకుంటున్నారా? ఓసారి ఒక భారతీయుడు ఇలా పొడవాటి గోళ్లు పెంచి రికార్డు సృష్టించినట్టుగా విన్నాడు లీ. అంతే తనూ ఆ పని చేయాలనుకున్నాడు. చేసేశాడు.

పి...అంటే... పట్టుదల

పి ఫర్ పిగ్ కాదు. పట్టుదల అని చెప్పుకోవాల్సి వచ్చేలా వుంది. చూడండి. ఈ పందికి రెండు కాళ్లే వున్నాయి. దానికీ వైకల్యం పుట్టుకతోనే వచ్చింది. రెండు కాళ్లతో పుట్టిన పందిపిల్లను చూచి అంతా ఆశ్చర్యపోయారు. ఆఖరుకు యజమానికూడా. అదెక్కడో ఏంటో వివరాలు చూద్దామా. గత జనవరిలో వాంగ్ జిహాయ్ అనే చైనీయుడి ఇంట్లో ఈ విచిత్రమైన సంఘటన జరిగింది. అతను పెంచుకొనే ఓ పందికి పుట్టిన 9 పిల్లల్లో రెండు కాళ్ల పంది ఒకటి. దాన్ని చూసి వాంగ్ భార్య 'ఛీ! ఇదేంటి. రెండు కాళ్ల పంది? వదిలేయ్' అంది. కానీ వాంగ్‌కి దాన్ని వదిలేయడానికి మనసు రాలేదు. 'చూద్దాం' అన్నాడు. అనడమే కాదు. రోజుకి గంటసేపు దాన్ని రెండు కాళ్ల సాయంతో నడక నేర్పాడు. తోక పట్టుకొని పైకెత్తి నడక అలవాటు చేశాడు. 30 రోజులకే అది చక్కగా నడవడం వచ్చేసింది. దాంతో వాంగ్‌తో సహా అతని భార్యకూడా ఊపిరి పీల్చుకుంది. ఇప్పుడది 50 కేజీల బరువుంది. అంత బరువున్నా సరే... తన రెండు కాళ్లతో నడుస్తున్న పందిని చూచి స్థానికులు ముక్కున వేలేసుకుంటున్నారు. దాని పట్టుదలను మెచ్చుకుంటున్నారు.



ఎక్కడున్నాయో తెలుసా!

బుజ్జాయిలూ...పింకీ, చిన్నూ ఆడుకుందామని పార్కుకి వచ్చారు. వారికి మూడు ఉడుతలు కనిపించాయి. కానీ అంతలోనే అవి ఎక్కడికో వెళ్లిపోయాయి. అవి ఎక్కడున్నాయో వీళ్లిద్దరికీ కనిపించలేదంట. మీకేమయినా కనిపించాయా?

నేర్చుకుందాం!





దాగున్నదేంటో?

హలో...ఇక్కడున్న చుక్కల్లో ఓ పే...ద్ద జంతువు దాగుంది. అదేంటో తెలియాలంటే 1 నుంచి 38 వరకు వరుసగా చుక్కలన్నీ కలిపేయండి.

పదాలు రాసేద్దాం

చిన్నారులూ...మీకు చాలా ఇంగ్లీషు పదాలు తెలుసు కదా. ఐతే మీకో చిన్న పరీక్ష. కింద బొమ్మలిచ్చాం. వాటి ఆధారాల సాయంతో నిలువు. అడ్డంలో ఉన్న ఖాళీ బాక్సు నింపేయండి.



జవాబులు : 1.rose, 2.sheep, 3.hat, 4.egg , 5.tag

ఏమేం వున్నాయి?

చిన్నారులూ... ఇక్కడో విచిత్రమైన ప్రాణి వుందా! అందులో కొన్ని జంతువుల శరీర భాగాలున్నాయి. వాటిని గుర్తించి అవేంటో చెప్పండి.

ఉత్తరం ఇచ్చేదెలాగబ్బా...

బుజ్జాయిలూ...చూశారుగా. పాపం పోస్ట్‌మ్యాన్ ఎలా తికమక పడుతున్నాడో. అతనేమో త్వరగా ఉత్తరాలన్నీ ఇచ్చేయాలి. అన్నీ ఇచ్చేశాడు కానీ ఒక్క ఉత్తరం మిగిలిపోయింది. ఆ ఇంటికి ఒక్కదారి కాకుండా నాలుగు రోడ్లుండి చాలా గందరగోళంగా ఉంది. ఏ దారిలో వెళ్తే ఆ ఇంటికి చేరుకుంటాడో మీరే సాయం చెయ్యాలి.





రంగులు అద్దితే...

పిల్లలూ... ఇక్కడ కొన్ని ఇంగ్లీషు అక్షరాలు ఉన్నాయి కదా.వాటిలో PARTY అన్న అక్షరాల్లో రంగులు వేయండి. ఏం కనిపిస్తుందో చూడండి.

ఆరు తప్పులు ఏంటో?!

హాయ్...ఇక్కడ ఓ చిన్ని పాప చక్కగా కాయలు కోస్తోంది కదా. ఇంతకీ విషయం ఏంటంటే ఈ బొమ్మలో ఆరు తప్పులున్నాయి. అవి ఏంటో మీరు కనిపెట్టాలి. సరేనా.

మాటల కోట - 36

రూపకర్త: వెంకట సుబ్బారావు కావూరి

■	1		■	2	■	3	4	■
5		■	6		7	■	8	9
	■	10		■	11	12	■	
■	13		■	14	■	15	16	■
17		■	18			■	19	
■	20	21	■	■	■	22		■
23	■	24	25	■	26		■	27
28	29	■	30	31		■	32	
■	32		■		■	34		■

అడ్డం :

1.తెలుగు రబీ (2)
3. ఇంటికి తలుపుండగానే సరిపోదు, దొంగలు పడకుండా ఉండాలంటే ఇదీ వేయాల్సిందే (2)
5. ప్రజలే (2)
6. కోపం (3)
8. మే...మే అనును (2)
10. పొట్టి అనురాగం తిరగబడింది, గాన విధానం (2)
11. శబ్దం వికృతి, మోత (2)
13. సమీప, తర్వాతి (2)
15. నాగలి, ఒకనాటి తెలుగు సినీనాట్యగత్తె (2)
17. బరువు (2)
18. మంచి రక్తం ప్రవహించే నాళాల్లో ఒకటి (3)
19. కక్ష, కోపం (2)
20. అండ, ఆసరా, సహకారం, పోటీ కర్ర (2)
22. అర్జునుడి ఆయుధం (2)
24. అడ్డం 19 లాంటిదే (2)
26. తల్లి బిడ్డకిచ్చే తొలి ఆహారం, దీన్ని సమగ్ర ఆహారంగా పరిగణిస్తారు (2)
28. తిరగబడిన మోసం, చెడ్డ ఆలోచన (2)
29. "పేరు గొప్ప. ఊరు దిబ్బ" సామెత సరిగ్గా అతికే కేంద్ర మంత్రిణి (3)
32. రోటిలో రుబ్బేది ఇదే (2)
33. తెలుగు ఖరీఫ్ (2)
34. సొమ్ము, నగదు, విలువయిన వస్తువు (2)

నిలువు :

1. వితరణ, సాయం, రాష్ట్ర మంత్రి ఇంటి పేరు (2)
2. అతి కోపధారి (2)
4. వాద్యాల సమ్మేళనం దారి మారింది (2)
5. ప్రపంచం (2)
6. కూపీ లాగు (2)
7. తెలుగు పదం అంచెకు సంస్కృతం, ఊహారూపమయిన ఈ పక్షి పాలనూ, నీళ్లనూ వేరు చేసేదని నమ్మకం (2)
9. సంస్కృత పదం కల్వానికి తెలుగు, పంట నూర్పిడి చోటు (2)
12. అంచు, గోటు... లాంటిదే! (2)
13. చెదిరిపోయిన పొట్ట (3)
14. మనకు ముందు మరో అక్షరంతో తెలుగు ప్రజా కవి (3)
16. లంకలో కాదు మన దగ్గర అనారోగ్య సమయంలో ఆహార నియంత్రణ (3)
21. కింద నుంచి చూసేది (2)
22. ఎస్పీ బాలసుబ్రమణ్యం ముద్దు పేరు (2)
23. ఆపద, పులి మీద ఇదని తెలుగు సామెత (2)
25. క్షమించటమే (2)
26. కొత్త కానిది (2)
27. ఆధారం, గాలి పటం దారం, పద్ధతి (2)
29. కింద నుంచి కారణం, నెపం (2)
31. యంత్రం (2)
32. సంబంధం, కలిసిమెలిసి పని, ఎన్నికల్లో వివిధ పక్షాల మధ్య ఏర్పడే ఒప్పందం (2)

మాటలకోట - 35జవాబు

1 పె	ద్ద	■	2 సం	క్రా	3 తి	■	4 తో	5 క
ను	■	6 చే	దు	■	7 రు	8 ణం	■	త్తి
■	9 పో	గు	■	10 గు	■	11 బా	12 రు	■
13 కా	పు	■	14 అ	రి	15 సె	■	16 ఆ	17 ది
ను	■	18 గ	బ్బ	■	19 గ	ట్టు	■	లు
20 పు	ష్య	■	21 రం	22 గు	లు	■	23 హ	క్కు
■	24 న	25 వ	■	రి	■	26 తు	లం	■
27 చి	■	28 డ	29 వా	■	30 వా	క్కు	■	31 గు
32 త్రం	ఆ	■	33 పు	న్న	మి	■	34 సు	త్తి



తొమ్మిది పదుల వయసులో తండ్రాయనే!

తొంభైనాలుగేళ్ల రామ్‌జిత్ ఆనంద డోలికల్లో తేలిపోతున్నాడు. మరి ఈ వయసులో తండ్రి అయితే అంతేకదా. పైగా తనను కలిసిన మీడియా వారికి ఆరోగ్యరహస్యాలు గొప్పగా చెప్తున్నాడు. రోజుకు అరకిలో వెన్న, మూడు లీటర్ల పాలు లాగించేస్తాడంట. అన్నట్టు యువకుడిగా వున్నప్పుడు ఈయనగారు మల్లయోధుడు కూడా. ఇదిగో హార్యానాలో తన ఇంటి ముందు భార్య, బిడ్డతో ఇలా ఫొటో ఫోజిచ్చాడు. మరో పదేళ్ల తర్వాత వచ్చి చూసినా తను ఇలాగే ఇదే రీతిలో బలంగా, ధృఢంగా వుంటానని కుండ బద్దలు కొట్టి మరీ చెప్తున్నాడు. అయితే ఈ వయసులో కూడా తండ్రయ్యే అవకాశముందని డాక్టర్లు సైతం అంగీకరిస్తున్నారు. ఇదంతా చదువుతోంటే తొంభయ్యేళ్ల వయసులో 21వ సారి తండ్రి అయిన రామ్‌జోగి గుర్తొచ్చాడా! అంటే... 2007లో నమోదైన ఆ రికార్డును రామ్‌జిత్ బద్దలు కొట్టేశాడన్నమాట. మరో తమాషా ఏమంటే...రామ్‌జిత్ తన వయసు 94 కాదని వందేళ్లని అంటున్నాడంట. కంగారు పడకండి బాస్! ఆయనగారి పెన్షన్ రికార్డుల్లో మాత్రం 94 ఏళ్లనే వుందిలెండి.

SIDDHARTH INSTITUTE OF ENGINEERING & TECHNOLOGY

SIETK

An ISO 9001:2000 Certified Institution

Affiliated to JNT University, Anantapur and Approved by AICTE, New Delhi,

PUTTUR: 517583,Chittoor Dist. Contact Nos:96425 04764, 93969 44144, 93969 32888, 93969 37888

EAMCET COUNSELLING CODE

B.Tech - (SDTN)

MBA/ MCA- (SETP)

M.Tech (SDIP)

TRANSPACIFIC CERTIFICATIONS LTD TCL

2010-2011 Proposed Courses

- M.Tech., (CAD/CAM)
- M.Tech., (Embedded Systems)

2010-11 Proposed Courses

CIVIL - 60 ECE - 60

A Unique Saga of Success

SIETK

SIDDHARTH INSTITUTE OF SCIENCE AND TECHNOLOGY

(Affiliated to JNT University, Anantapur and Approved by AICTE New Delhi)

Dr. K.Ashok Raju

CHAIRMAN

EAMCET COUNSELLING CODE B.TECH (SIST)

అందమైన చేతివ్రాత - ఉచిత శిక్షణ

Send SMS... "HRC" space "Your address" to 55352

India's No.1 Handwriting Expert, Graphologist, Graphotherapist, NLP Trainer, Handwriting Research Centre (HRC) అధినేత చదువుల డాక్టర్‌గా బిరుదాంకితులైన Sri. Bhasckarr Raaju గారి "గుడ్ హ్యాండ్రైటింగ్" ప్రత్యక్ష శిక్షణలో నిష్ణాతులైన 150 మంది శిక్షకులు రాష్ట్ర నలుమూలల వారి వారి ప్రాంతాలలో అందమైన చేతి వ్రాతను బోధిస్తున్నారు!!



HANDWRITING HOMESTUDY KIT ను సొంతం చేసుకొన్న వారికి అందమైన చేతివ్రాతపై ఉచిత శిక్షణ!!

FREE

మీ స్పెల్లింగ్ సమస్యకు పరిష్కారం ... మీ సెల్ ఫోన్‌లో ఉచితంగా...!!

SPELLING సమస్యా...?!

పరిష్కారం కొరకు...

Send SMS... HRC space SPELL to 55352

Specially designed to... 3rd to 10th Class



ప్రపంచంలో మొట్టమొదటిసారిగా ...
అందమైన చేతివ్రాతను సొంతం చేసుకోవడానికి
రూపొందించబడిన Hai-Pad, Hai-Slate లను సొంతం చేసుకోండి!
అందమైన చేతివ్రాత మీ సొంతం అవుతుంది!!

వివరములకు దిగువ కనబరచిన మీ సమీప డిస్ట్రిబ్యూటర్స్‌ను సంప్రదించండి!!

Chittoor : Bhasckarr Raaju Enterprises, ✆ : 9966555536, **Nellore** : Nazeem Enterprises, ✆ : 9440928532, **Guntur** : Sree Vigneshwara Enterprises, ✆ : 9440022999, **Vijayawada** : Bee Hive Enterprises, ✆ : 9866869649, **East Godawari** : Excellence Enterpises, ✆ : 9440776596, **Vizag** : K Enterprises, ✆ : 9396409988, **Warangal** : Sai Agencies, ✆ : 9347551328, **Ananthapur** : Akshara Distributors, ✆ : 9966987577.

మిగిలిన జిల్లాల్లో డిస్ట్రిబ్యూషన్ కొరకు వెంటనే సంప్రదించండి!!

For any information feel free to contact...

eHRC

Bhasckarr Raaju ... *Good Handwriting for All*

HANDWRITING RESEARCH CENTRE

1-5-565 Balaji Colony, TIRUPATI.

Cell : 9000072359, 9246997139